## నాచ్చియార్ తిరుమొழ்ழి
## 2వ తిరుమొழ்ழి నామమాయిరమ్

వెనుకటి తిరుమొழ்ழిలో ఆండాళ్ చేసిన కామసమాశ్రయణం, గోపికలు చేసిన కామసమాశ్రయణానికి అనుకరణమైన తిరుప్పావై వంటిది అని గమనించ తగినది. ఆమె తాను చేసిన కామసమాశ్రయణాన్ని చెప్పి, గోపికలు చేసిన కామసమాశ్రయణంలోని కొన్ని విశేషాలని చెప్తోంది. ఎందుకు అయా చేస్తోంది అంటే, తాను పొందాలనుకున్న కృష్ణుడిని పొందటానికి ఈవిధంగా చేసినవాళ్ళు ఇదివరకే ఉన్నారు అని చెప్పటానికి కావచ్చును. అందుకోసం గోపబాలికలు కామార్చనం, కాత్యాయినీ వ్రతాన్ని చేసేరు అని చెప్పటానికి రెండు తిరుమొழ்ழిలు వచ్చేయి. తిరుప్పావులోలాగే ఈ తిరుమొழ்ழి కూడా మరోవిధమైన అనుకరణంగా ఉన్నది. అంతేకాక, అక్కడ చేసినట్లుగా ఇక్కడకూడా కృష్ణుడు వచ్చి తనను అనునయించటం వంటివి చెయ్యలేదే అనే మనోవేదన చెప్పటం లేదు కాని, ఇక్కడ అతను చేసిన అల్లరిని చెప్తోంది. అంటే – గోపికలు చేసిన కామసమాశ్రయణాన్ని తెలుసుకున్న కృష్ణుడు "వీళ్ళతో మేం కలవటానికి శ్రమ పడవలసివచ్చేటట్టు ఉన్న ఈ గోపికలు ఉంటూంటే, మమ్ములని పొందటానికి వీళ్ళు కష్టపడటం ఏమిటి? అదికూడా, వీళ్ళు మాతో కలవటానికి మాకాళ్ళమీద పడకుండా ఒక దేవతాంతరాన్ని నిర్బంధించి ప్రార్థిస్తూంటే మేం చూస్తూండటం ఏమిటి? ఈ గోకులంలో గోపాలకులందరూ వర్షాలకోసం ఇంద్రుడికి అన్నం పెట్టటం చూసి, 'మేం పుట్టి పెరుగుతున్న ఊళ్ళో కొంతమంది మరొకదేవుడిని అర్చించటం తగునా?' అని దాన్నికూడా సహించలేక, ఆ అన్నాన్ని గోవర్ధనపర్వతానికి పెట్టించి తానే గోవర్ధనపర్వతమై ఆఅన్నాన్ని పూర్తిగా ఆరగించిన మేము, మాకే చెందిన వీళ్ళు మమ్ములని పొందటంకోసం మరొకడి కాళ్లమీద పడుతూంటే మేం చూస్తూ ఉండటం మాకే చిన్నతనం." అని వ్యసనపడతాడు. తనను పొందటానికని దివ్యదేశవాసం, స్వగతస్వీకారం, మడలెత్తటం వంటి సాధనాలని అనుష్ఠించటంగాని, తాను ఆదేవతాంతరాలకి అంతర్యామిగా ఉన్నప్పటికీ, అలాంటి ఇతరదేవతాసమాశ్రయణం గాని చేస్తూ వారు తనపొందుకోసం కష్టపడటం అసలే సహించలేడుగదా! తానే వారికి, ఒకపెద్ద దన్నుగా ఉంటూన్నవాడు, తనకి చాలా ప్రియమైన ఈ గోపకన్యలు,

తనని పొందటానికి కామసమాశ్రయణం చెయ్యటం ఈయనకి సహించరానిదే కదా! అందుచేత ఆనాడు చెరువొడ్డున గజేంద్రుడికోసం వచ్చి దాన్ని ఉద్ధరించినట్లుగా, ఇక్కడికి తాను వేగంగా వచ్చి ఆ గోపికలకు కనబడితే, వాళ్ళు ఇతగాడిని చూడనట్లుగా మరోవేపు చూస్తూంటే, తాను వాళ్ళు కట్టుకొన్న గుజ్జనగూళ్లని తన్నేయటం, వాళ్ళు పెట్టిన ముగ్గులని చెరిపివేయటం చేస్తి, ఆ విధంగా వాళ్ళు చేసిన కామసమాశ్రయణం తనకి ఇష్టంలేదని సూచించటం, వాళ్ళు తమగుజ్జనగూళ్ళని, ముగ్గులని కృష్ణుడు ధ్వంసం చేస్తూంటే వాటిని తన్నకు అని వాళ్ళనటం, నన్ను చేర్చుకోకుండా కట్టినవాటిని కుమ్మేస్తానని పట్టుబట్టటం ఇలాగ ఒక పెద్ద మహాభారతయుద్ధమై పోయింది. మేం అలా చెయ్యలేదు అని తన పరమైకాంతిస్థితిని కనబరచటం కావచ్చును. ఈ తిరుమొழ్ఙిలో ఆండాళ్ అక్కడున్న గోపికలందరికీ నాయకురాలుగా కనబడుతుంది. తిరుప్పావైలోకూడా గోపికలందరికీ తాను నాయకురాలై వాళ్ళు ఏవిధంగా పరమాత్మని పొందటానికి చెయ్యాలో చూపించి మార్గదర్శకురాలైంది. తాను కామదేవార్చనం చేసి స్వామితో సమాగమాన్ని పోగొట్టుకోవటంగురించి నాలుగో తిరుమొழ్ఙినుంచీ సాయిస్తుంది. మధ్యని రెండు తిరుమొழ్ఙిలలో గోపికల మాటలని ప్రకటిస్తోంది. తరువాత వాళ్ళతో సంధి కుదిరి, అదికూడా మళ్ళీ విడిపోవడంతో విఫలమవటం, ఈ సంఘటనని అనుకరిస్తూ ఆండాళ్ సాయించిన తిరుమొழ్ఙి ఇది. తొమ్మిదో పాశురంలో "నమ్మై ప్పఱ్ఱి మెయ్ప్పిణక్కిట్టక్కాల్" అని చెప్పడంవల్ల మనకి సంధికుదిరిందన్నవిషయం తెలుస్తుంది. తరువాతి తిరుమొழ్ఙి "కోழ்ఙియழைప్పదన్ మున్నమ్" వల్ల ఆ సంధికాస్తా మళ్ళీ విడిపోవటంతో విఫలమవటాన్ని తెలియజేస్తుంది.

మొదటి పాశురం.

మూ. నామమాయిరమేత్తనిన్ఱ నారాయణా నరనేయున్నై
మామి తన్ మకనాకప్పెఱ్ఱాల్ ఎమక్కు వాతై తవిఱుమే
కామన్ పోతరుకాలమెన్ఱు పఙ్గునినాళ్ కడై పారిత్తోమ్
తీమైశెయ్యుమ్ శిరీతరా ఎఙ్గళ్ శిఱ్ఱిల్ వన్దు శిఠైయేలే.

ప్రతిపదార్థము: ఆయిరమ్= అనేక(సహస్ర)ములైన, నామమ్= నామములతో ఏత్త=

స్తోత్రము చేయుటకు తగినట్లు నిన్ఱ= (నిత్యవిభూతిలో)ఉన్నతముగా వేంచేసియున్న నారాయణా= సర్వస్మాత్ పరుడైనవాడా, నారాయణా! నరనే= నరుడని చెప్పబడువాడా! (ఆశ్రితులకొరకు శ్రీరాముడవై అవతరించినవాడా!) మామి= అత్తయైన యశోదాపిరాట్టి ఉన్నై= నిన్ను తన్= తనయొక్క మకనాకప్పెర్ఱాల్= కుమారునిగా పొందినచో ఎమక్కు= మాకు వాతై= బాధపడుటయే తవిరుమే= తప్పునా? (లేక)తప్పును గదా! కామన్= మన్మథుడు పోతరుకాలమెన్ఱు= వచ్చుసమయమని పఙ్గునినాళ్= పంగుని(ఫాల్గుణ)మాసమున కడై= అతను వచ్చు మార్గమును చేసి పారిత్తోమ్= అలంకరించినాము తీమై= అల్లరిపనులను శెయ్యుమ్= చేయునట్టి శిరీతరా= శ్రియఃపతీ! వన్దు= మేము ఆడుకొనుచున్నప్రదేశమునకు వచ్చి ఎఙ్గళ్= మాయొక్క శిఱ్ఱిల్= గుజ్జనగూళ్ళను, ముగ్గులను శితైయేలే= చెరపకుము.

వ్యాఖ్యానం: మొదటి పాశురం. కృష్ణుడు ఈ గోపికలు తనని పొందటానికని దేవతాంతరాన్ని అర్చించటానికి సిద్ధపడుతున్నారే అని బాధపడుతాడు. ఇదివరకు గోపాలకులు తాను ఉండగా ఇంద్రుడిని పూజించటానికి సిద్ధపడటం కూడా నచ్చక ఆ పూజని ఇంద్రుడికి కాకుండా గోవర్ధనపర్వతంలో ఉన్న తనకే చేయించుకున్నాడు. అలాగే పూర్వం అగతికుడైన గజేంద్రుడిని రక్షించటానికి పరుగు పరుగున వచ్చేడు. ఇక్కడకూడా ఇప్పుడు గోపబాలికలని దేవతాంతరభజనంనుండి రక్షించి కాపాడడానికి అని వాళ్ళమధ్యకి వస్తున్నాడు.

(నామమాయిరమ్)నువ్వు నారాయణుడివి. నీగుణాలు, చేతలు మొదలైనవాటిని చెప్పే సహస్రనామాలతో నువ్వు స్తోత్రం చెయ్యబడుతున్నావు. నారాయణ అనే పదాన్ని వివరించబోతే ఎన్నోవిశేషాలు వస్తాయి. ఇట్లా స్తుతించబడే నువ్వు సహస్రనామాలతో నిన్ను నిందించవలసివచ్చేటట్లుగా వ్యవహరించవచ్చా? అని అంటున్నారు. (నారాయణా నరనే) సర్వేశ్వరుడే బదరికాశ్రమంలో నారాయణుడు, నరుడుగా అవతరించి గురుశిష్యులై లోకులని తత్త్వజ్ఞానులని చెయ్యటంకోసం పూర్వం వచ్చేడు. ఆవిధంగా మంచిచెయ్యటానికి వచ్చినవాడివి ఇప్పుడు అల్లరి చెయ్యవచ్చా?అని అన్నట్లు చెప్పవచ్చును. లేదా, నారాయణా – పాల సముద్రంలో పండుకొన్నవాడా! అని సంబోధనంగా చెప్పుకోవచ్చును. నరనే –

నారాయణశబ్దంలోనున్న నరశబ్దంచేతగూడా చెప్పబడేవాడా! అనికూడా చెప్పవచ్చు. దాన్ని పరిశీలించినప్పుడు 'న రిషయతీతి నరః' అన్న వ్యుత్పత్తిచేత ఎప్పుడూకూడా నశించని గొప్పవాడు అని చెప్పబడుతుంది. బొమ్మరిళ్లని నశింపజేసే నిన్ను నశింపచెయ్యటం ఎవరికిన్నీ సాధ్యం కాదుగదా! నీవు సమస్తాన్నీ నశింపజేసి ఏకోదకసముద్రంలో నారాయణుడివై యుండెడివాడవు అన్నమాట. నరుడితో పుట్టిన నారపదార్థాలన్నింటికీ అయనమైన వాడు– స్థానమైనవాడు అంటే, నరుడనబడేవాడు వేరు అనిపిస్తుంది. కాని అది సరికాదు అని చెప్పటానికే నరనే– ఓ నారాయణా నువ్వే నరుడివి కూడా, అని చెప్తోంది. "త్రై ర్యక్తః శ్రూయతాం నరః' అని చెప్పినట్లు మనుష్యభావన చేసి ఆదరించేవు. (నామమాయిర మిత్యాది.) పాలుతాగే చంటివాడు బాధపడుతూంటే వాడికోసంవాడి తల్లి తాను మందుతాగుతుంది. ఆవిధంగా ఈ చేతనులైన జీవకోటికోసం నరుడుగానూ, నారాయణుడుగానూ వచ్చి తపస్సుచేస్తే, దీన్ని చూసిన దేవతలు "దేవరవారు ఏమిచెయ్యదలచి ఈవిధంగా తపస్సు చేస్తున్నారు" అని స్తోత్రం చెయ్యటానికి తగినట్లుగా ఉన్న స్థితిని చెప్పినట్లుకావచ్చును. లేదా, "తద్విప్రాసో విపన్యవః" అని చెప్పినట్లు సంసారగంధమే లేనటువంటి నిత్యసూరులు స్తుతిస్తూంటే, ఉభయ విభూతులకీ నాయకుడుగా పరమపదంలో వేంచేసిఉన్న స్థితిని చెప్పినట్లు చెప్పుకోవచ్చును. (నరనే) ఆ నిత్యవిభూతినుంచి "జ్ఞాతుం ఏవం విధం నరం" అని చెప్పినట్లుగా ఈ భూమండలంమీదకి దశరథచక్రవర్తి కుమారుడుగా అవతరించటాన్ని చెప్పటం జరిగిందనీ చెప్పవచ్చును.

(ఉన్నైయిత్యాది) పరిచ్ఛిన్నులైన నిత్యసూరులు తనని యథార్థంగా తెలుసుకొని స్తుతిస్తూంటే, తన ఐశ్వర్యమంతా కళ్ళకికట్టేవిధంగా ఆయన పరమపదంలో వేంచేసి ఉన్నాడట. అక్కడనుంచి అవతరించి వేంచేసినప్పుడు "జ్ఞానులు, అజ్ఞానులు" అనే తేడా లేకుండా ఇక్కడ ఉన్నదంతా ఒకటే కుటుంబం అన్నట్టుగా అందరూ ఏకకంఠంగా స్వామితాలూకు సౌందర్య, సౌకుమార్య, సౌశీల్యాది కల్యాణగుణాలకీ పరవశులై రామో రామో రామ ఇతి ప్రజానామభవన్ అని వాల్మీకిమహర్షి చెప్పినట్లు లోకంఅంతా ఆయనని స్తుతించేవిధంగా వచ్చి అవతరించటాన్ని చెప్తున్నది. ఈవిధంగా స్వరూపంలోనూ, అవతారంలోనూ ఉన్న నీగుణాలు సహస్రాలు(లెక్కకు మించినవి)గదా! ఆయన అల్లరితనంచేత ఆడపిల్లలకి ఒళ్ళుమండి, అతను చేసే

కృత్యాలని అడ్డుకొనటానికి వీల్లేకుండా చేసి, చేసిన అల్లరిపనులన్నింటినీ వీళ్ళు సహించవలసివచ్చేటటువంటిస్థితిని కల్పిస్తూండడాన్ని చెప్పుతున్నది. ఇలాంటి అల్లరి చేస్తున్నావే! నీ గుణాలలో ఏగుణానికి ఇప్పుడు నీ ప్రవర్తన చెందుతుంది? అని అడిగినట్లన్నమాట. ప్రత్యక్షంగా భర్తవి అని చెప్పలేక, మరోవిధంగా మామితన్ మకనాక– అత్తకొడుకుగా అని చెప్తున్నారు. నువ్వు తల్లితండ్రులకి తెలియకుండా ఇప్పుడు వచ్చే పద్ధతి బాగులేదు, మేము నిన్ను భర్తగా పొందిన తరువాతనే నువ్వు మాతో కలవటం. అప్పుడు అత్తకొడుకుగానే నిన్ను పొందటం బాగుంటుంది. అపవాదుకూడా ఉండదు.

ఏదో ఒకసమయంలో ఎదురు పడితే, ఇలా బాధపెట్టే నువ్వు, ఎంత అత్తకొడుకువైనా బహిరంగంగా ఎప్పుడూ దుఃఖపెడుతున్నావు. అసలే చిలిపివాడివి, దానికి తోడు అత్తకొడుకుగా బాధపెడుతూంటే మేం బాధపడుతూండాలా? అలాకాకుండా నీ హద్దుల్లో నువ్వు ఉండి, మాకు అనుకూలంగా ఉండేటట్టు ఉండాలి. అటా ఉన్నట్లైతే మాకు బాధలేకుండా ఉంటుంది. అట్లా కాకుండా నువ్వుగాని నీ అల్లరితో మమ్ములను ఇలా బాధపెడితే ఇక మాకు చావే గతిగదా! భర్తగా అతడిని పొందాలని వాళ్లమనసులో గాఢమైన కోరిక ఈవిధంగా ప్రకటితమౌతోంది. మేనత్తకుమారుడిని భర్తగా పొందలేకపోతే కలిగే బాధవంటి విరహబాధలన్నీ లేకుండా పోతాయి అన్నమాట. అందుచేత, ఆవిధంగా కృష్ణుడిని భర్తగా పొందటానికి తమను కృష్ణుడితో చేర్చగలిగిన మన్మధుడికి ప్రీతి కలిగించటానికి బొమ్మరిళ్ళు కట్టటం, దారిని శుభ్రం చేసి ముగ్గులతో అలంకరించటం వంటివిచేస్తే ఆకామదేవుడు వీరిని కృష్ణుడితో చేర్చి, తొందరగా వీరి మనోరథాన్ని తీరుస్తాడని భావించి కామదేవార్చనకి సిద్ధపడుతున్నారు. ఇటువంటి మా ప్రయత్నాలని నువ్వుగాని చెడగొడితే మేం నిన్ను పొందటానికి వీలే కాకుండా పోతుంది. మాబాధలూ తీరకుండా పోతాయి అని అంటున్నారన్నమాట. (కామన్ ఇత్యాది) మేము వట్టినే ఆటలాడుకొనటానికి ఈ బొమ్మరిళ్ళు కట్టితే నువ్వు వాటిని తన్నేసినా మాకు బాధలేకపోవును. కాని ఇప్పుడు మాత్రం నువ్వు అలాటి పనులు చెయ్యవద్దు అని అంటున్నారన్నమాట.

(ఎమక్కు) మేం ఎలాంటివాళ్ళం – ఎంతక్రూరులైనవాళ్ళని కూడా వశం చేసుకునే నీ అందానికి దాసులమైపోయినటువంటి వారం. అసలు పుట్టుకే

ఆడపిల్లలుకదా! అల్లరిపనులు సహించక ఏం చేస్తారు– అని నువ్వు మమ్ములని అల్లరి పెడుతున్నావు అంటే, "నేను అల్లరి పెడుతున్నానా? అసలు మొదలు పెట్టినవాళ్ళు మీరు కదా, నేనేంచెయ్యటానికీ పాలుపోక దిగాలుపడి ఉంటే, నేను రావటం చూసి బొమ్మరిళ్ళని మీరే తన్నివేసి నన్నంటున్నారు" అన్నాడు చిలిపి కృష్ణుడు. "అలాగా! బహుశా నువ్వు వస్తావని నీ కోసం చేసేమనీ అనుకుంటున్నా వేమో. మన్మధుడు వచ్చేకాలం ఈ మాసం అందుకని మావాకిళ్ళన్నింటినీ అతనికోసం చక్కగా అందంగా చేసి పెట్టుకున్నాం. నీకోసం చేసేమనుకుంటున్నావేమో! మేం నీకోసం చేసేవాళ్ళం కాము. నువ్వు వచ్చి వీటినన్నింటినీ చూసి సంతోషించటానికి, నీతో కలవటానికీ చేసేవాళ్ళం అనుకున్నావేమో, మేము అలాంటివాళ్ళం కాము. మేము ఇలా అలంకరించటం వేరేవాళ్ళకోసం" ఇలా చెప్పేసరికి వాళ్ళుకట్టిన బొమ్మరిళ్ళనీ, వేసిన ముగ్గులనీ పాడుచెయ్యటం మొదలుపెట్టేడు. (శిరీదరా) ఓయి శ్రీధరా అన్నారు. లక్ష్మీదేవి నీకుపిరాట్టికదా నువ్వుచేసే అల్లరిపనులని ఆమె అడ్డుకోలేదా? అని అంటున్నారన్నమాట. ఇట్లా కృష్ణుడిని సంబోధించటంలో నీవు లక్ష్మీదేవిని ఎలాగ భర్తగా చూచుకుంటున్నావో, అట్లా మమ్ములనుకూడా నువ్వు చూసుకోవద్దా అని అడిగినట్లన్నమాట. లేక, ఆయన పిరాట్టిపేరుచెపితే వీళ్ళని దుఃఖపెట్టటం మానివేస్తాడని భావించి "మమ్ములను ఎవళ్ళనుకున్నావు? మీ ఆవిడమనుషులం మేం. మాతో ఇలా అల్లరి చేస్తావా?"అన్నారని కూడా అనుకోవచ్చును. పాపం వాళ్లావిడపేరెత్తితే ఊరుకుంటాడనుకున్నారు. "ఓస్, అంతేకదా, ఆవిడతో నాకున్నసంబంధం ఏమిటో మీరే చెప్తున్నారే, నేను లక్ష్మీదేవిభర్తని కదా! నేనేంచేసినా అడ్డుకొనేవాళ్ళు ఉన్నారా?" అని బొమ్మరిళ్లనీ, ముగ్గులని చెరపడం మొదలుపెట్టేడు. (తీమైయిత్యాది) "ఆవిడతో ఉన్న సంబంధం మాకు ప్రయోజనం అవుతుం దనుకున్నాం. అంతేకాని, మాకు నష్టం కలిగించేదిగా నువ్వు మమ్ములను బాధించి అలా ఆవిడని బాధించాలనుకుంటే, మేంకట్టుకున్న బొమ్మరిళ్లనీ, ముగ్గులని పాడుచెయ్యటంకాదు, ఆవిడ కట్టిన బొమ్మరింటినీ, వేసిన ముగ్గులని పాడుచెయ్యి. అప్పుడు తెలుస్తుంది అయ్యగారి సంగతి" అని అంటున్నారు.

(వన్దు శితైయేల్). నువ్వు రానూవద్దు, వచ్చి బొమ్మరిళ్లనీ, ముగ్గులనీ చెరపనూ వద్దు. నువ్వు చెరపటానికే వద్దామని అనుకుంటూంటే అసలు రానేవద్దు అని

అంటున్నారన్నమాట. కృష్ణుడిని వరించటానికని నోము నోస్తున్నారు. అలాంటప్పుడు ఆయన వచ్చి వీళ్ళు కట్టిన బొమ్మరిళ్ళని కూల్చివేస్తున్నాడు? అంటే, ఆపిల్లలమీద తనకి ఏమాత్రం ఆశలేదుసుమండీ అని వాళ్ళపెద్దవాళ్ళకి భావన కలిగించటానికే అంటారు ఉత్తమూర్ వారు. యథార్థానికి వీళ్ళుచేస్తున్న దేవతాంతరభజనం ఆయనకి సహించరానిదిగదా! ఇదే విషయం గోవర్ధనోద్ధరణంలో కూడా సూచించేడు. దీన్ని చెప్పటానికే ఈ తిరుమొళ్ళి అవతరించిందంటారు శ్రీఉత్తమూర్వారు. సామాన్యులలా గోపికలు దేవతాంతరసేవ చెయ్యటం కృష్ణుడు సహించలేదు. దీనివల్ల మనం గ్రహించవలసినదేమిటి అంటే పరమైకాంతులుగా ఉండవలసిన మనం ఆ విధంగా ఉండటానికి ఎటువంటి ఆటంకము గాని లోటుపాట్లుగాని రాకుండా నడుచుకోవాలన్నమాట.

అవతారిక: బొమ్మరిళ్లుకట్టడం కూడా సుఖమైనది కాదు. దానిమీద ప్రీతితో నీవు వచ్చినట్లైతే వచ్చి కటాక్షించు. అంతే తప్ప వాటిని పాడుచెయ్యవద్దు అని ఈ తరువాతి పాశురంలో చెప్తున్నారు.

మూ. ఇన్ఱు ముఱ్ఱుమ్ ముతుకునోవ ఇరున్దిఴైత్త ఇచ్చిఱ్ఱిలై
నన్ఱుమ్ కణ్ణుఱ నోక్కి నాజ్గళుమ్ ఆర్వన్దన్నై త్తణికిడాయ్
అన్ఱు పాలకనాకియాలిలై మేల్ తుయిన్ఱ ఎమ్మాతియాయ్
ఎన్ఱుమున్దనక్కు ఎజ్గళ్మేల్ ఇరక్కమ్ ఎఴ్ఴాతతు ఎమ్బావమే. 2

ప్రతిపదార్థము: అన్ఱు= ప్రళయకాలంలో బా(పా)లకన్= చిన్న శిశువు ( పాలకన్ -లోకాలని పాలించి రక్షించేవాడివి) ఆకి= అయి ఆలిలై= మర్రియాకు మేల్= పైన తుయిన్ఱ= పండుకొని ఉన్న ఎమ్= భక్తులమైన మాకు ఆతియాయ్= కారణమూర్తివై, (లేక) మాకు నాయకుడవైన కృష్ణా! ఇన్ఱు= ఈనాడు ముఱ్ఱుమ్= పూర్తిగా ముతుకు= మావీపులు నోవ= నొప్పిపుట్టిబాధపడునట్లు ఇరున్దు= కూర్చొని ఇఴైత్త= తయారు చేసిన ఇచ్చిఱ్ఱిలై= ఈ బొమ్మరిళ్ళను ఉమ్= మాకిష్టమైన కణ్= నీకళ్ళు ఉఱ= సహించి,ఆర్ద్రమగునట్లు నన్ఱు= బాగుగా(చల్లగా) నోక్కి= చూచి

నాజ్గళుమ్= మేమును ఆర్వమ్ తన్నై= నీకుగల ఆశను (ప్రీతిని) తణి= తృప్తి కిడాయ్= పరచుకొనుము ఎన్జమ్= ఎల్లప్పుడును ఉన్దనక్కు= నీకు ఎజ్గళ్‌మేల్= మాపై ఇరక్కమ్= దయ ఎళ్లాతతు= కలుగకపోవుట ఎమ్బావమే= మేము చేసికొనిన పాపమే.

వ్యాఖ్యానము: రెండవ పాశురము. (ఇన్రు ముళ్ఖుమ్) వీరు ఒకపగలంతా కష్టపడి బొమ్మరిళ్ళు కట్టినా వీరికి అదే చాల శ్రమతో కూడుకొన్నది. "ఆయిరమూళ్లియాయ్ నెడుకి తోళ్లిన పడి" అంటారు పెరియవాచ్చాన్పిళ్ళై. అంటే వాళ్ళకి ఆ ఒక్కపగలు వెయ్యియుగాలుగా చాలా ఎక్కువ కాలంగా అనిపించిందట. (ముతుకు నోవ) వీపులు నొప్పిపెట్టగా – మేమెంతో కష్టపడ్డామయ్యా వాటిని కట్టడానికి అంటున్నారు. నీవు లోకాలని సృష్టించాలని "బహుస్యాం ప్రజాయేయ" అని అనుకున్నావు వెంటనే అవి సృష్టింపబడ్డాయి. నువ్వు తల్చుకుంటేచాలు. మాకు అలాక్కాదే! మేమా– అఱివొన్డుమిల్లాత ఆయర్‌కులం– జ్ఞానమేమీ లేని గొల్లజాతిలో పుట్టిన అబలలమైన మేము – ఎలా తయారుచెయ్యాలో తెలుసుకోవాలి, మేము కట్టటానికి అవసరమైన పదార్థాలని తెచ్చుకోవాలి, కట్టే పరికరాలు తెచ్చుకోవాలి, కట్టటానికి కావలసిన శక్తి పుంజుకోవాలి, నడ్డివిరిగేటట్లు రోజంతా కూర్చొని కట్టాలి. (ముతుకు నోవ) నడుములు నొప్పి పెట్టేటట్లు. మీరిమీద ఉండే ప్రీతిచేత వీరు ప్రార్థించినట్లు బొమ్మరిళ్లని కూల్చకుండా వీళ్ళ నడుములని పట్టుకుంటాడేమో, ఆ విధంగాతమకు కావలసిన కృష్ణసమాగమాన్ని పొంది ఆనందిద్దామనుకొని, అని "అబ్బా వీపు పీకేస్తోందయ్యా" అని అంటే, అయ్యో పాపం వీపు పడతానని అంటాడేమో అని వీరి ఆశ. "అట్లా దగ్గరగా నిల్చొని బొమ్మరిళ్లని పాడుచెయ్యకపోతే దగ్గరగా వచ్చి చేతులతో నడుము దగ్గరప్రేమగా రాస్తూండవచ్చుకదా" అని భావించి "ముతుకు నోవ" అంటున్నారులా ఉన్నదంటారు పెరియవాచ్చాన్పిళ్ళై. అసలే అబలలు. దానికితోడు విరహబాధచేత కృశించినవాళ్ళు. కృష్ణుడు తన అందమైన కళ్ళతో ప్రేమగా చూడాలని మనస్సుల్లో విరహబాధతోకృశించి నిలవలేకపోతున్నారు, వెన్నతిని పెరిగినవీళ్ళు ఇంత కష్టం సహించలేరుగదా! (ఇరున్దు) ఒకచోట ఉండి. గాలిని పట్టుకొని ఒకచోట ఉంచడం ఎటువంటిదో, వీళ్లని ఒకచోట అట్టేపెట్టడం అలాంటిదేనంటారు పిళ్లైగారు. (ఇళ్లైత్త) మనసులేని పని చెయ్యడం చాల కష్టమైనది

కదా! మనసొకచోట శరీరం ఒకచోట అన్నట్టుగా మామనస్సులు నీదగ్గర పారవేసుకున్నాం. అయినా మేం ఈ బొమ్మరిళ్లని కట్టేం. *(ఇచ్చిఱ్ఱిలై) వీటిని చూసేవా?* వీటిని చూసిన తరువాతే వీటిని పాడుచెయ్యాలనుకుంటున్నావా? ఇవి ఎంత ముచ్చటవేస్తూ ఉన్నాయో చూసిన జ్ఞానం ఉన్నవాళ్ళెవళ్లూకూడా దీన్ని పాడుచెయ్యరే. నువ్వే మొదట పాడుచేస్తున్నావు.

(నామ్ కొళుమ్

(నోక్కి నాజ్గళుమ్) ఇక్కడ నామ్ కొళుమ్ అన్న పాఠం అణ్ణంగరాచార్యులవారు ఉపయోగించారు. పెరియవాచ్చాన్పిళ్ళైకూడా నాజ్గళుమ్ అన్న పాఠాన్నే ఆదరించేరు. కాని ఇప్పుడు వాక్యాన్వయం కుదరదు. నాజ్గళ్ నోక్కి నీ తణి కిడాయ్ అన్నవాక్యం సమంజసం కాదు. నాజ్గళుమ్ నోక్క అనే ప్రయోగం సరిపోతుంది. పెరియవాచ్చాన్పిళ్ళై గారు కృష్ణుడు చూడటం, ఆండాళ, గోపికలు చూడటం ఇలా అన్నీ కలిపి చెప్పినట్లుగా కనబడుతుంది. బాగా చూస్తే, నీ కణ్ణాల నోక్కి ఆర్వన్దన్నై తణి అన్నదే ఒక వాక్యం. మధ్యలో నాజ్గళుమ్ అని, నాజ్గళుమ్ నోక్కుకిరోమ్ అని మరొకవాక్యాన్ని తెచ్చి పెట్టుకోవాలి. నోక్కి అన్న పదంమీద నాజ్గళుమ్ అని ఉమ్‌తోపాటుగా చెప్పడమే తగి ఉండగా నోక్కువోమ్ అన్నమాట చేర్చాలనుకోవటం వేరే చెప్పనక్కరలేదు. ఇట్లాంటి ప్రయోగం ఒక అందమైన ప్రయోగం. ఈ నాజ్గళుమ్ అన్న పదం మొదటి పాదంలో ఇజ్జైత్త అన్న పదంతోపాటు కలిపి చెప్పుకోవచ్చును. తయారుచెయ్యటమే తెలియని మేం వెన్ను పీకేటట్లు కష్టపడి తయారుచేస్తే అనే అర్థంవస్తుంది. కాని వెనుకటి అన్వయమే బాగుంది. ఎక్కడ పదం ఉన్నదో అక్కడే అర్థంకూడా ఉన్నది. ఈ పాఠాన్ని వదిలేసి, నామ్‌కొళుమ్ అన్న పాఠాన్ని కల్పించటం కొళ్ళుమ్ అనేపదం వికారం చెంది కొళుమ్ అయింది అన్నట్లైతే, నాజ్గళుమ్ అన్న పాఠాన్ని వదలకుండానే నామ్ కళుమ్ అని విడదీసి, కళ్ళుమ్ అన్న పదం వికారం చెంది కళుమ్ అని అయింది అనికూడా చెప్పవచ్చును. అప్పుడు ఏమి అర్థం వస్తుందంటే – బొమ్మరిళ్ళమీద నీకున్న అభినివేశాన్ని మేం దొంగిలించేం. దాన్ని చూసినందువల్ల దాంతో అక్కడ ఇష్టాన్ని వదిలేసి మామీద మేసుకున్నాం.

ఆర్వమ్ తన్నై త్తణికిడాయ్ అన్నదానికి నువ్వు చూడాలి. అని మేం బొమ్మరిల్లు కట్టేంకనుక నువ్వు దాన్ని చూస్తే మా ఆశయం తీరుతుంది. ఆవిధంగా తృప్తి అని

అర్థాన్ని చెప్తారు. చిఱ్ఱిల్ శితైయేల్ అన్న సందర్భాన్ని చూస్తే 'నీకున్న ప్రీతిని బాగా చూసి తృప్తిని పొందు. అంతేతప్ప చెడగొట్టటంలోమాత్రం ఆ తృప్తిని చెప్పకు' అని అర్థం చెప్పవచ్చు. నాఙ్గళుమ్ అన్నవాక్యానికి భావం ఏమిటి అంటే – కొంచెం కొంచెంగా మేం చేస్తూ పోతూంటే నువ్వు పాడుచేస్తూపోతే నువ్వు పూర్తైనదాన్ని చూడటం ఎక్కడుంటుంది? మేంకూడా కళ్ళారా పూర్తైన బొమ్మరిల్లుని చూడాలా? అందుచేత నువ్వు పాడుచెయ్యకు. అంతా అయిన తరువాత నువ్వు వాటిని చూడటం మేం చూడాలి. ఈవిధంగా తృప్తి చెందిన ఆశ, ప్రీతితోనున్న నిన్నుకూడా మేం కళ్లారా చూస్తాం. అంచేత మేమూ చూసేటట్లు నువ్వు చూసి నీ ఆశని తృప్తిపరుచుకో.

నేను దీన్ని పాడుచేస్తే మీకేమి అన్నాడు కృష్ణుడు. మేం దీన్ని ఏర్పాటు చెయ్యడానికి ఎంత కష్టపడ్డామో చూసేవా? మేం దీన్ని ఒక్కసారి చూస్తే తరువాత పాడు చేస్తామనుకున్నావా? అదేమిటి? మీరు దాన్ని పాడుచేసి తరువాత పాడైపోయింది అంటున్నారు కదా! సగంసగంగా చూస్తున్నాము తప్ప పూర్తి ఇంటిని లేకుండా చేసేవు. మేం కంటికి ఇంపుగా చేసేం. అవును నేను చూసి సంతోషించేను. (నాఙ్గళుమ్ ఆర్వన్దన్నై త్తణికిడాయ్) మేంకూడా ఒక్కసారి చూద్దాం అనుకునేసరికి చెడగొట్టి మా సంతోషాన్ని పాడు చేసేవు.

(అన్ఱిత్యాది) నీకు వయస్సురాకమునుపే మాకు భయం కలిగేలా చేశావు కదా! (అన్ఱు పాలకనాకి యాలిలైమేల్ తుయిన్ఱ) "నాకింత ఆలోచన కూడానా? మీ బొమ్మరిళ్ళవల్ల చాలా గొప్పప్రయోజనం కావాలనుకుందికి అంతజ్ఞానం నాకెక్కడిది నేనింకా చిన్నపిల్లవాడినే కదా!" "చిన్నపిల్లవాడినైన నేను ఇంతగా ఆలోచించటానికి శక్తిలేనివాడిని" అని అనుకోవద్దు. చిన్నపిల్లవాడిగా ఉండగానే ఎంతశక్తి చూపించేవు! మహాసముద్రంలో ఒక లేతమఱ్ఱియాకుమీద పడుక్కున్నావు. ఆచిగురుటాకు నీళ్ళలో మునిగిపోకుండా చాలా తేలికైనవాడిగా అయినావు. ఆశరీరంలో సమస్తలోకాలనీ పెట్టుకొని లేతదైన మఱ్ఱియాకుమీద పడుక్కొని, యశోదాదేవి ఉయ్యాలలో నిన్ను పడుక్కోబెట్టితే ఇటూ అటూ దొర్లుతూ చేసేపనులన్నింటినీ ఆ ఆకుమీదనే చేసి ఆవిషయం తెలిసినువ్వు నీళ్ళలో నడకుండా నిన్ను రక్షించటానికి ఏ తల్లీకూడా లేకుండా ఉన్నప్పుడు క్షణకాలంలో మహాప్రవాహం వచ్చి ఆపద సంభవించిందను కునేటంతలో ప్రమాదకర మైనపని (ఆకుమీద ఇటూ అటూ దొర్లటం) చేసి ఆనాడు

మమ్ములను భయంతో సగం ప్రాణాలు పోగొట్టుకొనేట్లు చేసేవు.

ఇక్కడ బాలకనాయ్ అన్నప్పుడు శిశువు అనే అర్థంలో వచ్చే అర్థం ఇది. తమిళంలో పా, బా అనేశబ్దాలకి ఒకటే అక్షరం గనుక, అదే పదాన్ని పాలకనాయ్ అని కూడా చెప్పవచ్చు అప్పుడు లోకాలనన్నింటినీ రక్షించి పాలించేవాడివి అనే అర్థం చెప్పాలి.

(ఆతియాయ్)లోకాలన్నీ నశించిపోయినట్లున్నా ఆ లోకాలన్నీ నీ చిన్నశిశువు బొజ్జలో ఇమిడిపోయి ఉండేటట్లు చేసి వాటిని కాపాడేవు. ఆవిధంగా తరువాత జగత్సృష్టికే కారణభూతుడవైనావు. ఇట్లా చిన్న శిశువువై సమస్తాన్నీ కడుపులోపెట్టుకొని కాపాడే బాలుడివైన నువ్వు ఆలోచించగలశక్తి లేనివాడివా? అందుచేతనే నీలో ఏలోటూ లేదే. అప్పుడు ఆవిధంగా మమ్ములను హడలకొట్టేవు, ఇప్పుడేమో ఇలా మాబొమ్మరిళ్లని పాడుచేస్తున్నావు. అంచేత మేమే నీకు దొరుకుతున్నామంటే మామీద కటాక్షం కలగకపోవటానికి ఒక ప్రత్యేకమైన సమయం అంటూ ఉండనక్కరలేదు. ఏదైనా సమయమే. లోకాలని రక్షించేవాడికి కటాక్షం జాలి ఉండవనుకోవటానికి వీల్లేదుకదా కాని మామీద ఆ కటాక్షం పడకపోవటానికి మాపాపమే కారణమై యుంటుంది. 'మత్పాప మేవాత్ర నిదానమాసీత్' అని భరతుడూ, 'మమైవ దుష్కృతం కిఞ్చిన్మహదస్తి న సంశయః' అని సీతమ్మ చెప్పినట్లు మాలోనే గొప్పపాపం ఏదో ఉన్నది. అదే నీకు మామీద దయరాకుండా అడ్డుకొంటోంది. 2

నేను బొమ్మరింటిని పాడుచేస్తానని ఇక్కడ నాకంటికి కనబడకుండా ఇక్క దున్నారా! లేక మరోచోట ఉన్నారా? వాళ్ళు అలా నా దగ్గరనుండి కాపాడుకోవాలనుకుంటే నేను వాళ్ళకి తెలియకుండా బొమ్మరింటిని పాడుచేస్తానని అనుకొని వాళ్ళని దొంగచూపులతో చూసేడు. అలా చూడటం గమనించి ఆండాళ్, గోపికలు ఇలా అంటున్నారు.

*మూ. కుణ్డునీరురైకోళరి! మతయానై కోళ్విడుత్తాయున్నై*
*కణ్డుమాలుఱువోఙ్గళై కడైక్కణ్ణాలిట్టువాతియేల్*
*వణ్డల్ నుణ్మణల్ తెళ్ళియామ్ వళైక్కైకళాల్ శిరమప్పట్టోమ్*

*తెణ్డిరైక్కడల్పళ్ళియాయెజ్గళ్ శిఱ్ఱిల్ వన్దు శితైయేలే.* 3

ప్రతిపదార్థము: *కుణ్డు*= లోతైన, *నీర్*= సముద్రములో *ఉఱై*= నివసించుచున్న *కోళరీ*= బలిష్టమైన సింహమా! *మతమ్ యానై*= మదించిన ఏనుగు(గజేంద్రుని) యొక్క *కోళ్విడుత్తాయ్*= కష్టమును తీర్చినవాడా! *తెణ్*= స్వచ్ఛతగలిగిన *తిరై*= అలలనుగల *కడల్*= పాలసముద్రమునందు *పళ్ళియాయ్*= శయనించియున్నవాడా! *ఉన్నై కణ్డు*= నిన్ను చూచినక్షణములోనే *మాల్*= నీపైవ్యామోహమును *ఉఱు*= పొందిన, *వోజ్గళై*= మమ్ములను *కడైక్కణ్గళ్ ఇట్టు*= నీవును నీ కడగంటిచూపులతో *వాతియేల్*= బాధించినచో *(ఆల్*= శ్రమ*) వణ్డల్*= ఒండ్రుమట్టినుండి *నుణ్మణల్* = సన్నని ఇసుకను *వళై కైకళాల్*= కంకణములుగల చేతులతో *తెళ్ళి*= పిసికి *యామ్*= మేము *శిరమప్పట్టోమ్*= కష్టపడి తయారుచేసితిమి *ఎజ్గళ్ శిఱ్ఱిల్*= మేము తయారుచేసిన బొమ్మరిండ్లను *వన్దు*= వచ్చి *శితైయేల్*= పాడుచేయకుము.

వ్యాఖ్యానము: మూడో పాశురం: రెండు విశేషణాలతో కృష్ణుడిని సంబోధిస్తున్నారు. అందులో మొదటిది నరసింహా! అని సంబోధన ఫలానంత లోతు అని చెప్పటానికి సాధ్యంకాని ఏకార్ణవంలో ఇక సృష్టికార్యాన్ని మొదలు పెట్టాలనుకొని క్షీరార్ణవంలో పడుక్కొనియున్ననరసింహమూర్తి! క్షీరార్ణవంలో పడుక్కొనియున్నవాడు నరసింహస్వామి అని చెప్పుతున్నారని ఆశ్చర్యపడనవసరం లేదు. అవ్యక్తోపనిషత్తులో ఏకోదకసముద్రంలో నరసింహమూర్తిగానే స్వామి వేంచేసి ఉన్నాడని చెప్పబడింది. ప్రళయకాలంలోలోకాలన్నీ జలమయములై ఏకార్ణవమై ఉన్న స్థితి."పనిప్పరవై త్తిరైతతుమ్బ ప్పారెల్లామ్ నెడుజ్గడలేయాన కాలమ్" అనిగదా పూర్వాచార్యులు సాయించటం. సృష్ట్యుపక్రమంలోసర్వేశ్వరుడు ఆ ఏకార్ణవంలో శయనించి ఉంటాడుగదా!

లోకంలో సింహం ఏనుగుని చంపుతుందన్నది ప్రసిద్ధం. అలాంటి సింహస్వామి గజేంద్రుడి క్లేశాన్ని తొలగించటం, దానిని కాపాడటమనేదే మహాద్భుతం. అటువంటి మహాశ్చర్యకరమైన చేతలు గలవాడుకదా ఆయన! మహాప్రళయంవచ్చినపుడు కంటికికూడా కనబడనిసమస్తచేతనాచేతనవర్గానికి ఏ శ్రమా కలుగకుండా

తనకడుపులో పెట్టుకొని రక్షించినవాడా! సృష్టికి ముందు ఆత్మలు కంటికి కనబడనంత సూక్ష్మస్థితిలో కదా ఉంటాయి. అంటే సూక్ష్మ-చిదచిద్విశిష్టపరమాత్మా! అని చెప్పటం. ఇక సృష్టించబడినటువంటి చేతనాచేతనాలని కాపాడుతూ ఉండేవాడా అని సంబోధిస్తున్నారు. (మతయానై కోళ్ విడుత్తాయ్) మదించియున్నటువంటి గజేంద్రుడికి వచ్చిన కష్టాన్ని తీర్చినవాడా! ఇక్కడ గజేంద్రుడికి మదించిన అని విశేషణాన్ని వెయ్యటంలో ఒక స్వారస్యం గమనీయం. గజేంద్రుడు ఎన్నోయుగాలు తానే మొసలిని ఓడించగలనని గర్వంతో పోరాడి గర్వభంగం అయినతరువాతనే చివరికి గదా నీవే తప్పనితఃపరంబెరుగ అని శరణాగతి చేసేడు. దాన్ని సూచించటానికే మదయానై అన్నపదాన్ని ప్రయోగించటం జరిగింది అంటారు ఉత్తమూర్‌వారు. ఇక మతమొళ్ళుకు వారణముయ్య వళిత్త (4-10) అని సాయించేరుగదా! ఇక, కోళ్ విడుత్తాయ్ అన్నప్పుడు కోళ్ అంటే దుఃఖం లేక బాధ అని అర్థం చెప్పకుండా కోళరి అన్నప్పటిలాగనే బలము అని అర్థంచెప్తే, తన సింహరూపానికి తగినట్లుగామదించిన కువలయాపీడంతాలూకు బలాన్ని నశింపచేసినావు అని చెప్పవచ్చును. దాన్ని చంపినప్పటికీ, "అతన్ కొమ్బొశిత్తాన్" అని చెప్పినట్లుగా "అతన్ కోళ్ విడుత్తాన్" అనికూడా చెప్పవచ్చును.

కడైక్కణ్‌కళాలిట్టు వాతియేల్ - చక్కగా కళ్ళారా నువ్వు చూడాలి అని ఆశిస్తున్నవారిని కొనచూపులతో చూడటం అంటే హింసించటమేకదా! చల్లగా చూసి కౌగలించుకుంటాడని ఆశించినవాళ్లకి అలాఅలా దూరంనుంచే చూసేసి వదిలేయటమంట అంతకంటే పెద్ద హింసేమున్నది?

ఎల్లప్పుడును సృష్ట్యవర్గం తాలూకు దుఃఖాన్ని తీర్చేవాడివి! నిన్ను సేవించుకొని, నీమీద వ్యామోహాన్ని పొందటమే కాకుండా ఆ వ్యామోహంతో పిచ్చెక్కియున్నామయ్యా అంటున్నారు. నిన్ను సేవించుకొని నీకు తామరపుష్పాన్ని సమర్పించుకోవాలని మొసలినోటికి చిక్కి బాధపడుతున్న గజేంద్రుడిని రక్షించావే! నిన్ను సేవించటంతోటే నీమీద వ్యామోహాన్ని పెంచుకొన్న మా బాధను తీర్చవా? అంటున్నారు. మాకు నీమీద వ్యామోహం కలిగింది అని చెప్పగానే వాళ్ళవేపు ప్రేమగా కడకంటితో చూసేడు. దానితో వాళ్ళవ్యామోహం మరింతగా పెరిగింది. ఇక స్వామితో సంశ్లేషం లేనిదే బతకలేని స్థితికి చేరేరు. అంచేత కడగంటి చూపులు కాదయ్యా మాకు

కావలసినది. మమ్ములను నేరుగా చూసి మమ్ములను దగ్గరకు చేర్చుకో అంటున్నారు.

నేను కంటికొసలతో చూస్తే మీకేమి కష్టం అన్నాడట. అక్కడే వచ్చింది చిక్కు. ఆ కడగంటి చూపులతోనే మమ్ములను బాధపెడుతున్నావయ్యా. అలాకాదు బాగా చూడవయ్యా! నీకోసం మేం ఎంత శ్రమపడుతున్నామో! ఎక్కడ ఒండ్రుమట్టి ఉంటుందో అని వెతికి, అక్కడికి వెళ్ళి ఆమట్టిని పిసికి తెచ్చేం. ఎందుకోసం? నీకు ఆనందం కలిగించటానికి మంచి బొమ్మరిళ్ళు కట్టాలని. మమ్ములనీ, మాచేతులనీ చూసేవా? మేం సుకుమారులం. నువ్వు తడిమిచూసి బాగున్నాయి అని మాచేతికి తొడిగిన కంకణాలు పెట్టుకొని, ఆతరువాత మమ్ములను దూరం చేసేవు ఆదుఃఖాన్ని ఆ కంకణాలను చూసుకొంటూ సహించేం. అలాంటి సుకుమారమైన చేతులు, కంకణాలనిండా పిసికిన మట్టి అంటిఆ మట్టితో ఎంతో కష్టపడి బొమ్మరిల్లు తయారు చేసేం, అలిసిపోయాం.

వెనుకటి పాశురంలో ఇసుకని తెచ్చిన తరువాత దానితో బొమ్మరిల్లు కట్టటానికి మెన్నునొప్పిపెట్టేలాగ కూర్చొని తయారు చేసేం అన్నారు. ఇప్పుడు వండ్రుమట్టిని పిసకటంతో శ్రమపడ్డాం అంటున్నారు. నువ్వు మా చేతులకి తొడిగిన కంకణాలు ఏమీ పాడుకాకుండా మట్టిని పిసికేం మామూలుగా పిసకటానికంటే కంకణాలు పాడుకాకుండా జాగ్రత్తపడుతూ మెల్లగా పిసకటం అంటే కష్టం ఎక్కువకదా! ఆవిధంగా తాము చాలా కష్టపడి తయారుచేసిన బొమ్మరిళ్ళు అంటే జాలిపడి వాడిని పాడుచెయ్యడని ఆశించేరు.

ఇలా వాళ్ళు చెప్పినా ఆ బొమ్మరిళ్ళని పాడుచేయటం మొదలు పెట్టేడు. ఓతెళ్ణిరైక్కడల్పళ్ళియాయ్! అని పిలుస్తూ, తెళ్ణిరై అని ఒక విశేషణం వేసేరు లోతైన సముద్రానికి. లోతైనసముద్రంలో చెత్త, మురికి చేరే అవకాశమే లేదు. అందుచేత ఎన్ని అలలు వచ్చినా ఆ సముద్రం స్వచ్ఛంగానే ఉంటుంది. అలాంటి సముద్రంలో పండుకొని వేంచేసియున్నవాడా! సింహమైననువ్వు నీ ప్రతాపాన్ని ఏనుగుమీద చూపాలే తప్ప కంకణభూషితాలైన చేతులతో బొమ్మరిళ్లని కట్టుకొనే చిన్నపిల్లలను అల్లరిపెట్టటం తగునా? గజేంద్రుడిని రక్షించిన కరుణాసముద్రుడివైన నీవు రక్షించి కటాక్షించవలసినది పోయి, బాధించటం సరికాదే! పాలసముద్రంలో పడుకున్నట్లు నీశ్రీవైకుంఠంలో హాయిగా పడుక్కోవలసినది పోయి ఇక్కడికెందుకయ్యా రావటం?

ఏమయ్యా! నువ్వు అసలు శ్రీవైకుంఠాన్ని వదిలి పాలసముద్రంలోకి ఎందుకు వచ్చేవు? నీ బొమ్మరిల్లైన ఈసృష్టి పాడు కాకుండాలనే కదా? అలాంటివాడివి మా బొమ్మరిళ్ళనెందుకు పాడుచేస్తున్నావు? మా బొమ్మరిల్లువల్ల నీలోకానికి ఏమీ ముప్పులేదే! మాబొమ్మరిల్లు నీ బొమ్మరిల్లులాగ తేజోవాయ్వంశాలతో తయారుచేసినది కాదని దాన్ని చెడగొడతావా? ఇది ఉపాదేయమా? మా బొమ్మరిళ్ళని పాడు చెయ్యకుండా నీ బొమ్మరింటిని కాపాడుకో. నువ్వు సేతువుని కట్టేవే, అప్పుడెవళ్ళైనా వచ్చి దాన్ని పాడుచేసి ఉంటే నీకెంతకోపం వచ్చి ఉండేది? ఆ సముద్రం వచ్చి పాడుచెయ్యకుండా చూసుకో. అవసరమైతే చెలియలికట్టవంటిదాన్నికట్టి రక్షణలని చేసుకోవయ్యా! అంటున్నారు.

3

తామరలవంటి నేత్రాలతో కటాక్షించిన కృష్ణుడు వీళ్లమాటలు విని "మీరు కంటిచూపులని కూడా సహించలేని సుకుమారులైన ఆడపిల్లలు" అంటూనే వాళ్లుకట్టిన బొమ్మరిళ్ళను పాడుచెయ్యటానికి మొదలుపెట్టేడు. అది చూసి మళ్ళీ మొరపెడుతున్నారు.

మూ. పెయ్యుమాముకిల్ పోల్వణ్ణా ఉన్ఱన్ పేచ్చుమ్ శెయ్కైయుమ్ ఎఙ్గళై
మైయలేఱ్ఱి మయక్కవున్ ముకమ్ మాయమన్దిరన్దాన్కొలో
నొయ్యర్ పిళ్ళైకళెన్బతఱ్కున్నై నోవనాఙ్గళురైక్కిలోమ్
శెయ్యతామరైక్కణ్ణినా యెఙ్గళ్ శిఱ్ఱిల్ వన్దు శిఱైయేలే. 4

ప్రతిపదార్థము: పెయ్యుమ్=వర్షించు మాముకిల్ పోల్=పెద్దమేఘంవంటి వణ్ణా=వర్ణము గలవాడా! శెయ్యతామరైక్కణ్ణినాయ్=ఎర్రతామరలవంటి నేత్రములు గలవాడా! ఉన్ఱన్=నీయొక్క పేచ్చు ఉమ్=మాటలును శెయ్కై ఉమ్=అల్లరిచేతలును మైయల్ ఏఱ్ఱి=వ్యామోహమును పెంచి ఎఙ్గళై=నీవనిన చాలప్రీతిగలమమ్ములను మయక్క=పిచ్చెత్తినట్లుగాచేసి ఉన్ ముకమ్=నీ ముఖము మాయమ్ మన్దిరమ్ తాన్కొల్=ఆశ్చర్యకరమైన ఒక మంత్రమేకదా! నొయ్యర్=వీరు అమాయకులు,

పిళ్ళైకళ్=చిన్న ఆడపిల్లలు ఎన్పతఱ్కు=అని నీవు చెప్పుటకు బదులుగా నోవ=బాధపడునట్లుగా నాజ్గళ్=మేము ఉన్నై=నిన్నుగురించి ఉరైక్కిలోమ్=ఏమియు దూషించలేదు (మేము ఇట్లు నీకు లొంగియుండగా) యెజ్గళ్ శిఱ్ఱిల్ వన్దు శితైయేల్=నీవు వచ్చి మా బొమ్మరిళ్ళను పాడుచెయ్యకుము.

వ్యాఖ్యానము: ఒక కారుమబ్బు ఆకాశంఅంతాకూడా దద్దరిల్లేటట్టు ఉరిమి, గర్జించి తిరిగినట్టుగా చూసేసరికి హాయిగా అనిపించి శ్రమఅంతా తీరిపోయేటట్టుగా ఉన్న దివ్యమంగళవిగ్రహంతో ఈ ఆడపిల్లలదగ్గర తిరుగాడుతున్నట్లున్నదట. ఈ పిల్లలు కాస్తా ఆ దివ్యమంగళవిగ్రహసౌందర్యానికి ముగ్ధులైపోయి దానికి వశులైపోయాం అంటూ చెప్పగానే, బాగుంది ఇదే మంచి అవకాశం అని "నేను మీకు దాసుడిని, మీవాడినే" అంటున్నట్లుగా ఏవో కొన్ని మాయమాటలు చెప్పటం, వాళ్ళ చేతులు పట్టుకొని వేళ్ళు కొరుక్కోవటం వంటి ఏవో కొన్ని చేష్టలు చెయ్యటం మొదలుపెట్టేడు. నీ మాయమాటలు, చిలిపి చేష్టలు మమ్ములను పిచ్చెక్కిస్తున్నాయంటే దానికి కారణం మరేదో ఉండాలి. రోషంతెప్పించేవి మాకు నీమీద వ్యామోహం పెంచుతున్నాయి అంటే, ఏదో మాయలమంత్రాలబలంవల్లనే అయి ఉండాలి. ఆ మంతత్రం కూడా జాగ్రత్తగా చూస్తే, నీ తిరుముఖమండలం అనే తేలుతోంది. దాన్ని చూసేసరికి వాటినన్నింటినీ అనుకూలంగా భావిస్తున్నాం. దాంతో ఆ మాయమాటలకీ, చేష్టలకీ లొంగిపోయి, మతిచెడటానికి నీ ముఖం ఏమైనా మంత్రించిన పొడి లాగుంది అన్నారు వాళ్ళు. అదేదయితే మాత్రం ఏమి? అయినా ఒకసారి నాకు చిక్కినతరువాత మీరేంచెయ్యగలరు కనుక! అన్నాడు. ఏమి, ఇంకేం చెయ్యలేమనుకుంటున్నావా? నువ్వు చాలాకాలంనుంచీ మా చుట్టూ తిరిగిచేసినదంతా మేం ఒక్కమాటతో కొట్టిపారేసి నువ్వు మరి కలికంలోకి కూడా లేకుండా చేసేం. అలా చేయగలం. అలా చేస్తే ఏమిటి? "వీళ్ళు లేకుండా తనకి నడవదని భావించి పాపం, ఈ పిల్లడు వాళ్ళతో కలవటానికి ప్రయత్నిస్తే ఇతను లేకపోతే మనకి ఏమిటి నష్టం, ఇతను మనతో చేరవద్దు అని ఇట్లాగనే అడ్డుకుంటారా? వీళ్లకేమీ తెలియదు, చిన్నపిల్లలు" అని నువ్వు మాజట్టులో ప్రవేశించి చేసే మాయలూ,మర్మం తెలియనివాళ్ళు, చెప్పటం మొదలుపెడతారుకదా అని మేం నిన్ను బాధపెట్టటంలేదు. మాకునువ్వు మమ్మల్ని అల్లరిపెట్టకుండా ఒకమంచిమాటచెప్తేచాలు, నువ్వంటే

మాకెంతో ఇష్టమన్నారు. ఆ తరువాత బొమ్మరిళ్లనిపాడుచెయ్యటానికి ప్రయత్నించటం మానకపోయినా వాళ్లవేపు ఆదరంతో చూసేడు. నీ ఎర్రతామరలవంటి కళ్ళతో మమ్ములను ప్రేమగా చూడు, మాకు నీమీదుండే ప్రీతిని చెడకొట్టుకోకు. కాళ్ళతో మా బొమ్మరిళ్ళని పాడుచెయ్యకు అని బ్రతిమలాడుతున్నారు. 4

ఇంత చెప్పినా బొమ్మరిళ్ళచుట్టూ వేసిఉన్న ముగ్గులనిచెరుపుతూవస్తున్న కృష్ణుడిని చూసి, వచ్చేకోపాన్ని అణచుకొని ఇలా అంటున్నారు.

మూ. వెళ్ళైనుణ్మణఱ్కొణ్డు శిఱ్ఱిల్ విశిత్తిరప్పట్ట వీతివాయ్
తెళ్ళి నాజ్గళ్ళైత్త కోలమళ్షిత్తియాకిలు మున్తన్ మేల్
ఉళ్ళమోడియురుకలల్లాలురోడమొన్టుమిలోజ్గణ్డాయ్
కళ్ళమాతవా కేశవావున్ముకత్తనకణ్గళల్లవే 5

ప్రతిపదార్థము: *కళ్ళమ్= కపటములైన చేష్టలను చేయు,మాతవా= శ్రియఃపతీ! కేశవా= కేశిని సంహరించినవాడా! వెళ్ళైనుణ్మణల్= తెల్లని సన్నని* ఇసుకను*(ముగ్గును) కొణ్డు=* ఎత్తుకొని *శిఱ్ఱిల్=* బొమ్మరిళ్ళు *విశిత్తిరప్పడ=* ఎన్నోరకములుగావిచిత్రములైనవిగా ఉండునట్లు *వీతివాయ్=* ముంగిళ్ళను వీధిలో *తెళ్ళి=*ఆరబోసివేసి *నాజ్గళ్=* మేము *ఇళ్షైత్త=* తయారుచేసిన *కోలమ్=* అలంకారములను *అళ్షిత్తి=* పాడుచేయుచున్నావు *ఆకిలుమ్=* అయినను *ఉన్తన్ మేల్=* నీవిషయమున *ఉళ్ళమ్=* మాహృదయములు *ఓడి=* పరుగులు పెట్టి *ఉరుకల్=* ఆశ్చర్యముతో కరిగిపోవుట *అల్లాల్=* తప్పు *ఉరోడమ్=* రోషము *ఒన్టుమ్=* కొంచెము కూడ *ఇలోమ్=* కలిగినవారిమి కాము *కణ్డాయ్= చూచితివా! ఉన్ ముకత్తన=* నీ ముఖమునయున్నవి *కణ్గళ్ అల్లవే=* కన్నులు కావా?

వ్యాఖ్యానము: మన్మథుడు దుష్టశీలదేవతకనుక అతడికి ఏమాత్రంకూడా అప్రీతి కలగకుండా ఉండాలి. వీధినంతటినీ వెన్నెల పరిచినట్లుగా తెల్లగా, అందులోకూడా చిన్నరాళ్ళుగాని ఉన్నట్లైతే అంతనీ విసిరేసి వెళిపోయే దేవతకనుక, అచ్చమైన తెల్లనిముగ్గుని తీసి జల్లించి పరిచి, దానిమీద రకరకాలైన బొమ్మరిళ్ళని చేసి వీధిని అలంకరించేరు. నేను విచిత్రమైన సృష్టిని చెయ్యగలను అని చెప్పుకొనే కృష్ణుడిలాగే

మేంకూడా చెయ్యగలం అని చూపగలిగినవాళ్ళు ఈ పిల్లలు. “వీధిలో మేంచేసిన చక్కని బొమ్మరిళ్లనిగాని నువ్వు పాడుచేశావో, చూసుకో. ఈ బొమ్మరిల్లు చూసేవా ఎంతబాగుందో, దీన్ని పాడుచెయ్యటానికి ఎవరికీ చేతులురావు. నువ్వొక్కడివే పాడుచేస్తున్నావు.” అన్నారు “నేను పాడుచేస్తేమాత్రం మీరేం చెయ్యగలరు? అన్నాడు. నువ్వు పాడుచేసినా “అయ్యో ఎవడోబొమ్మరింటిని ఎలా పాడు చేశాడో” అని మనస్సుకష్టపెట్టుకొని దుఃఖపడి కోపంతెచ్చుకోవటం వంటిది మాకు రావటం లేదు.” అన్నారు. ఒళ్ళుమండినా, ఏమీ చెయ్యలేక అన్నమాటగదాయిది. వీళ్ళు తమలోతాము అయ్యో పాడైపోయిందే అని బాధపడ్డా, తనమీది ఇష్టంతో ఏమీ అనటంలేదని, తాను మొదలుపెట్టిన కార్యాన్ని వదలకుండా, దాన్నికూడా మరుపులుపెట్టి శ్రియః పతిత్వం తోచేట్లులీవిగా అక్కడ తచ్చాడుతున్నాడు. ఏదో పరధ్యానంలో ఉన్నట్టుగాను, జుత్తుసరి చేసుకుంటున్నట్లు ఆ బొమ్మరిళ్ళనీ, అలంకారాలనీ పాడుచేస్తూ వాళ్ళదగ్గరకి వచ్చేడు. ఈ విషయం తెలుసుకొని “పాపాత్ముడా! నువ్వు ఈ బొమ్మరిళ్ళని చూస్తూచూస్తూ పాడుచేస్తున్నావు, కళ్ళు నెత్తికెక్కేయా? వీటిని ఎంతో బాగున్నాయని నీ కళ్ళు ఆనందిస్తాయి, మమ్మల్ని మెచ్చుకుంటావు (చల్లబడటానికి తగినవి) అనుకున్నాం. కాని నీకళ్ళు నెమిలికళ్ళలాంటివి, మాకు ఎందుకూ పనికిరానివి. ఆకళ్ళు గాలంవేసేకళ్ళు. నువ్వు లక్ష్మీదేవికి భర్తవనీ, ఆమెవల్ల నీ బుద్ధిబాగుపడి ఉంటుందనుకున్నాం. నువ్వు కేశవుడివి కదా, నీ అందమైన కేశాలు చూస్తే అందరం సంతోషించవచ్చునుకున్నాం కాని నువ్వేదో మరోపనిచేస్తున్నట్టు నటిస్తున్నావు.” అన్నారు. ఈవిధంగా సాగింది పెరియవాచ్చాన్పిళ్ళైవారి వ్యాఖ్యానం.

అయితే అణ్ణంగరాచార్యులవారు మన్మధుడు దుష్టశీలుడుగనుక అతనికి కోపం రాకుండా ఉండటానికి మంచి తెల్లని ఇసుకని గులకరాళ్ళు మొదలైనవి లేకుండా ఉండేటట్లు జల్లించి బొమ్మరిళ్ళుకట్టి, అతను వచ్చే వీధిఅంతటా ఈ తెల్లని ఇసుక పరిచి, అందంగా ముగ్గులు వేసి అలంకరించేం. మేం ఇలా కట్టిన బొమ్మరిళ్ళని, ముగ్గులనీ నువ్వు చెరిపి పాడుచేసినా సర్వస్వామిత్వరుడివైనవాడు ఇట్లా అంతా చేస్తున్నాడే! ఏమి సౌశీల్యం చూపిస్తున్నాడు! అని మనస్సులు కరిగిపోయి నీరైపోవటం తప్ప కోపం రావటం లేదు. కాని నీ ముఖంలో ఉన్నవి కన్నులే అయితే, ఈ బొమ్మరిళ్ళని పాడుచెయ్యటానికి సిద్ధపడకు. ఈ బొమ్మరిళ్ళని ప్రీతితో చూడటం కదా ఆ

కళ్ళున్నందుకు ప్రయోజనం అని అంటున్నారనివ్యాఖ్యానం సాయించేరు.

ఉన్ ముకత్తన కణ్ణిల్లవో అని అనటంలో, నీవు మేంకట్టిన బొమ్మరిళ్ళని చూసి ఆనందిస్తావనుకున్నాం కాని వీటిని పాడుచేస్తున్నావు. నీకళ్ళతో అందరినీ నీకు దాసానుదాసులుగా చేసుకుంటున్నావే అనే ఆరాధనతోకూడిన నిందాస్తుతి కనబడుతుంది.

ఉత్తమూర్‌వారు "కణ్ అంటే చూసే వస్తువును యథాతథంగా చూసే ఆవయవం అని, అందమైన బొమ్మరిళ్ళని అలా అందమైనవిగా చూడలేనికళ్ళు, నీమీద కోపంఏపిసరూ లేకుండా నువ్వంటే కాస్తా కరిగిపోయే మనస్సుగలవాళ్ళమనీ చూడలేని కళ్ళు కళ్ళేనా? అలా చూడలేని కళ్ళున్నవాడు కణ్ణన్ – కన్నులు గలవాడు అని ఎట్లా అనుకోవటం? మాధవుడివి, బ్రహ్మరుద్రాదులకి ఈశ్వరుడివి అయిన నువ్వు మేం ఒకసారి దేవతాంతరభజనం చేస్తే సహించలేక కపటంతో వ్యవహరిస్తున్నావని అనుకుంటున్నాం" అని ఆండాళ్ అంటోందని భావన అంటారు.

నేను దేనినీ చెడగొట్టటానికే వచ్చినవాడిని కాను. నా ముఖం మంచి కళ్ళుగలది కనుకనే ఇక్కడికి వచ్చేను అంటూ కృపచేసే ప్రియుడి అవస్థని స్వీకరించేడు కృష్ణుడు. అప్పుడు ఈవిధంగా ఆపిల్లలు చెప్తున్నారు.

*మూ. ముత్ఱిలాతపిళ్ళైకళోమ్ ములైపోన్దిలాదోమై నాడోఖుమ్*
*శిత్ఱిల్మేలిట్టు క్కొణ్డునీ శిఱితుణ్డుతిణ్ణెన నామతు*
*కత్ఱిలోమ్ కడలైయడైత్తరక్కర్ కులజ్గళై ముత్ఱవుమ్*
*చెత్ఱు, ఇలజ్ఞైయై ప్పూశలాక్కియ శేవకా ఎమ్మై వాతియేల్ 6*

ప్రతిపదార్థము: *కడలై*= సముద్రమునకు *అడైత్తు*= సేతువును కట్టి *అరక్కర్*= రాక్షసుల *కులజ్గళై*= కులములను *ముత్ఱవుమ్*= సమూలముగా *చెత్ఱు*= నశింపజేసి, *ఇలజ్ఞైయై*= లంకను *పూశల్*= రణరంగముగా *ఆక్కియ*= చేసిన *శేవకా*= వీరుడా! *నాళ్‌తోఖుమ్*= ప్రతిదినమును *శిత్ఱిల్*= బొమ్మరిళ్ళను చేయుటను *మేల్ ఇట్టు*= ఇకముందు చెయ్యబోయేదానికి కారణంగా చేసుకొని *ముత్ఱు ఇలాత*=

పరువమును పొందని పిళ్ళైకళోమ్= చిన్నఆడపిల్లలము ముల్లై= స్తనములైనను పోన్దిలాదోమై= సరిగాపెరగనిమమ్ములను కొణ్డు= వశపరచుకొని నీ= నీవు చేతలుచేయుట, మాటలుమాటలాడుట అనెడి శిఱితు ఉణ్డు= కొన్ని విషయములున్నవి అతు= అట్టివిషయములను తిణ్ణెన= బాగుగా నామ్ కర్ర్రిలోమ్= మాకు తెలియదు ఎమ్మై= మమ్ములను వాతియేల్= బాధించకుము.

వ్యాఖ్యానము : ఆరవ పాశురము. ఒక స్త్రీరత్నంకోసం నువ్వు సముద్రానికే సేతువుని కట్టటంవంటి నీచేతలని తల్చుకుంటే నీనువ్వు చూపించే ప్రేమకి హద్దు లేదని తెలుస్తుంది. కాని ఆ ప్రేమ మామీద నువ్వు చూపటం లేదు. బహుశః దానికి కారణం ఆమెలాగ మేము వయస్సు వచ్చినపిల్లలం కాకపోవటమే. అట్లు భావించి మామీద నీ ప్రేమని చూపటం మానవద్దు. నువ్వు రాక్షసులతో యుద్ధం చేయటం బాగుందికాని మాతో తగదు అని ఆండాళ్, గోపికలు కృష్ణుడితో అంటున్నారు.

ఇలా చేసేడు అని చెప్పుకోవటానికి వీల్లేని చేష్టలు కొన్ని చెయ్యటం ఆరంభించేడు. అది చూసి ఈ పిల్లలు ఏవో ఇటువంటిపనులు చెయ్యటమేనా నీకు కావలసినది? అలాంటి పనులు ఏవయస్సువాళ్ళతో చెయ్యాలో తెలియనక్కర లేదా? మా వయస్సు నువ్వు చేసే చేష్టలకి తగినది కాదు. మేము ఇంకా చిన్నవయసువాళ్ళమే. మావయస్సుకి తగిన జ్ఞానమూ మాకు లేదు. పోనీ, నీతో సరసాలాడతగినవాళ్ళైతే అలా చిలిపి చేష్టలు చెయ్యవచ్చు. మాకు ఆ విధమైన యోగ్యతా లేదు. ఏదో ప్రమాదవశాత్తు చెయ్యటం కాకుండా ఒక్క బొమ్మరిళ్ళు కట్టేరు అని ఒక మిషతో నువ్వు ఇట్లా చేస్తున్నావంటే దానికి ఏదో మనస్సులో పెట్టుకొని చేస్తున్నావు. అలాంటివి మాకు తెలియదు, మేం వాటిని నేర్చుకోలేదు. నువ్వు అనుకున్నవాటిని తెలుసుకొనేందుకు మేం ఎవరిదగ్గరా ఉండి అలాంటివి నేర్చుకోలేదు.

మీరు నేర్చుకోకపోతేమాత్రం నష్టమేమిటి, నేను నేర్చుకున్నాను గదా! అని బాధించటం మొదలుపెట్టేడు. పూర్వం ఒకప్పుడు ఏవరినీ బాధించి ఎరుగనివాడు సముద్రానికే సేతువునికట్టి, వాళ్ళమీద ఆధిపత్యంచెలాయించినవాడంటూ ఏవడూ ఇంతవరకూ లేని రాక్షసజాతిని పక్కవేళ్ళతో సహా నిర్మూలించి, వాళ్ళరాజధానివేపు కన్నెత్తికూడా చూడలేని వైభవం కలిగిన లంకానగరాన్ని యుద్ధరంగం చేసిన

వీరపురుషుడా! మామీద యుద్ధం మొదలు పెట్టకు. శత్రువులమీద ప్రయోగించేవాటిని నీకు అనుకూలులమైన మామీద ప్రయోగించకునీ వీరత్వం ఒక సాధ్వీమణికోసంగదా చేసేవు. అలాంటికారుణ్యప్రధానమైనది ఆమెకోసమే తప్పు మరెవరికీ ఆవిధంగా ఉపయోగించవా? 6

ఏదో నీ మనసులో పెట్టుకొని నువ్వు మామీద చిలిపి చేష్టలు చేస్తున్నావు అని మీరనటం సరికాదు. బొమ్మరిళ్ళు కడుతున్నారే! ఎవరికోసం వీటిని కడుతున్నారు? మీ ఇళ్ళల్లో చాలామంది ఉన్నారని మరొక జాగా చూసుకుంటున్నారంటే, యమునానది ఒడ్డున ఉన్న పొదరిళ్ళలాంటివి బాగుంటాయి. ఇలాంటి ఇళ్ళుకడితే ఏంలాభం? మన్మథుడు వస్తాడని చేస్తున్నామంటారా, మన్మథుడు రతీదేవితో కలిసి ఉండడానికి ఇవి బాగుంటాయా? ఇలా అంటూ బొమ్మరిళ్లని చెరపటానికి ప్రయత్నాలు మొదలుపెట్టేడు. అపుడు గోపికలు నీకు మమ్ములను బాధపెడితే ఏం ప్రయోజనం? మిమ్మల్ని అల్లరిపెడితే అదొక సరదాగా మాటాడుతారు కదా? ఆ మాటలువిని ఆనందించి ఇంకా మీతో మాటాడవచ్చు అని అనుకుంటున్నావేమో అది కుదరదే అంటున్నారు తరువాతి పాశురంలో.

*మూ. పేతనన్గఱివార్కళోడివై పేశినాల్పెరితిన్ శువై*
*యాతుమొన్ఱఱియాత పిళ్ళైకళోమై నీ నలిన్దెన్ పయన్?*
*ఓతమాకడల్ వణ్ణా! ఉన్ మణవాట్టిమారొడు శూఝుమ్*
*శేతుపన్దమ్ తిరుత్తినాయెజ్గళ్ శిఱ్ఱిల్ వన్దు శితైయేలే.* 7

ప్రతిపదార్థము: *పేతమ్*= (నీ మాటల)అర్థాన్ని *నన్గు అఱివార్కళోడు*= బాగా అర్థంచేసుకొనగలవారితో *ఇవై*= ఈ మాటలను *పేశినాల్*= మాటలాడితే *పెరితు ఇన్ శువై*= చాలా భోగ్యంగా ఉంటుంది *యాతు ఒన్ఱుమ్ అఱియాత*= నీమాటలనెంతమాత్రం అర్థం చేసికొనలేని *పిళ్ళైకళోమై*= చిన్నబాలికలమైన మమ్ములను *నీ నలిన్దు ఎన్ పయన్?*= నీవు బాధించినచో ఏమి ప్రయోజనము? *ఓత*= అలలతోనిండియున్న *మా కడల్*= పెద్దసముద్రమువంటి *వణ్ణా!*=

శరీరవర్ణముగలవాడా *శేతుపన్దమ్ తిరుత్తినాయ్*= సేతువును కట్టినవాడా! *ఉన్ మణవాట్టిమారొడు శూழుఱుమ్*= నీ భార్యలపై ఒట్టు *ఎజ్గళ్ శిత్రిల్ వన్దు శితైయేల్*= మా బొమ్మరిళ్ళను పాడుచేయకుము.

వ్యాఖ్యానము: ఏడవ పాశురము: గోదాదేవికి కోపం వచ్చింది. నువ్వు పెద్ద సముద్రానికి అడ్డంగా సేతువును కట్టేవు లోకానికంతటికీ నీ చేష్టలు అన్నీ తెలుసును. అంతగొప్పవీరుడివి, నీ వీరత్వం చిన్న ఆడపిల్లలమైన మాదగ్గర చూపించటానికి ప్రయత్నిస్తున్నావు. మా బొమ్మరిళ్ళని పాడుచెయ్యటానికి చూస్తున్నావు. ఇది న్యాయమా? నీతో సరిసమానమైనవాళ్ళతో యుద్ధం చెయ్యాలిగాని తక్కువవాళ్ళతో కాదు. నీ భార్యలమీద ఒట్టు. మా బొమ్మరిళ్ళని పాడుచెయ్యకు అని అంటోంది.

కృష్ణుడు గోపబాలికలని చూసి వాళ్ళని అల్లరి పెట్టటానికి ఏవో మాటలు చెప్పడం మొదలు పెట్టి వాళ్ళబొమ్మరిళ్ళని పాడుచెయ్యటానికి మొదలుపెట్టేడు. మాటాడినమాటలన్నిటికీ బైటికి ఒక అర్థం లోపల వేరొక అర్థం వచ్చేటట్టు మాటలాడటం మొదలుపెట్టేడు. అపుడు "నువ్వు చెప్తున్నమాటలకి అసలర్థం ఏమిటో తెలిసినవాళ్ళతో నువ్వు చెప్పినట్టైతే ప్రయోజనం కాని మాతో చెప్తే ఏం ప్రయోజనం? మేం మాటలలోని కాపట్యం తెలియనివాళ్లం. ఆ మాటల అర్థం తెలిసినవాళ్లకి చెప్తే లాభం. వాళ్ళైతే ఒకమాటకి పది (రహస్యమైన)అర్థాలు చెప్పగలరు. ఆమాటలు నీకు చాలా ఇష్టంకదా! నువ్వు నీళ్ళు కావాలి అంటే నీళ్ళే తెచ్చే చిన్న ఆడపిల్లలం మమ్ముల్ని నువ్వు బాధిస్తేమాత్రం ఏమీ ప్రయోజనం ఉండదుసుమా!" అంటూ ఇలా బతిమాలుకున్నప్పటికీ, వారి బొమ్మరిళ్ళని పాడుచెయ్యడానికే మొదలు పెట్టేడు. (ఉన్ మణవాట్టియొడు అని ప్రత్యేకంగా ఒకరిని చెప్పకుండా బహువచనప్రయోగం చేయటానికి కారణం మర్మగర్భితంగా మాటాడేరు. ఏకపత్నీవ్రతుడైనవాడిని చూసి, "మేం కాక నీకు ఎంతమందో భార్యలుంటారుగదా! ఆ నీ భార్యలతోడుగా మమ్ములను బాధించకూడదు" అని ఆపిల్లలు అంటున్నారు.

"నీకు మంచివాళ్ళతోకలసిఉండాలని లేదా ఏమిటి? దీన్ని పాడుచేస్తున్నావు. నువ్వు పాడుచెయ్యాలంటే ఇవే దొరికినాయా? మిగతావి ఎన్ని లేవు? వాడిని పాడుచెయ్యవచ్చుగదా!" అంటూ ఇక్కడ వీళ్ళుకూడా మర్మగర్భంగా మాటాడుతున్నారు.

ఏకపత్నీవ్రతుడిని “మేం కాకుండా నీకెంతమంది భార్యలున్నారు” అని అడగటం లాగ అన్నమాట. ఇలా చెప్పినా వినకుండా తనపని తాను మొదలుపెట్టబోయేడు. అప్పుడు నీ బలానికి తగినటువంటి జన్మం అయినా, ఆడవివాళ్ళనీ, కోతులనీ పరికరాలుగా చేసుకొని సముద్రంలో అంతమట్టితో, రాళ్ళతో, సేతువుని కష్టపడి కట్టేవే. అబలలమైన మేం ఈ బొమ్మరిళ్ళని కట్టటానికి పడిన కష్టం ఆమాత్రం చెయ్యకపోయిందా? ఇక్కడ సేతుబంధం తిరుత్తినాయ్ అని చెప్పినపుడు నీవు ఆనాడు ఏకపత్నీవ్రతుడివికదా అట్లాంటివాడిని నీ భార్యలమీద ఒట్టుతో మమ్ములను బాధించకు అని చెప్పటంలో ఆఒక్కసీతమ్మనే ఎంతమందిగానో భావించి ఆమెని కాపాడిననీకు ఆమెవిషయంలో ఒక మంచి గొప్పతనం ఉన్నదే! అటువంటి ఆమెమీద ఒట్టువేస్తున్నాం అని భయపెట్టటమేనన్నమాట.

శూళ్ళుఱుమ్ అని సామాన్యంగా అనుసంధానం. అంటే ఒట్టు అన్నమాట. శూళ్ అన్నపదానికి ఆణై–ఒట్టు అని అర్థం. శూళ్ అన్నది మారి శూఝ్ అన్నమాటగా వ్యవహారంలోకి వచ్చిందన్నమాట. వాళ్లై ప్పళ్ళమ్ అన్నమాట వికారం చెంది వాళైప్పళమ్అని వ్యవహారంలో ఉన్నట్టుగనే ఇది కూడా వచ్చిందన్నమాట. మాదగ్గరనే నిన్ను అట్టేపెట్టుకొని నీ భార్యదగ్గరకు వెళ్ళలేకుండా చేస్తాంసుమా అనే అర్థంవచ్చేందుకు శూళఱుమ్ అనకుండా శూళ్ళుఱుమ్ అని భయపెట్టేపదంలాగ వీళ్ళు చెప్తున్నారన్నమాట. ముందుముందుపాశురాల్లో ఇటువంటిదే ‘ఆయర్ శిఱుమికళ్ మళ్ళలచ్చొల్లై’ అన్నప్రయోగం ఉండటం గమనీయం. అంటే చాలా మధురంగా ఉండేవిధంగా మాటలాడటం మాకుకూడా తెలుసును సుమా అని చెప్పటం అన్నమాట. 7

నామాటలలోని మాధుర్యాన్ని మీరు అనుభవించలేకపోయినా, నా అందమైన విగ్రహాన్ని చూసి, బుగ్గలు కొరికివేయాలనిపించేటటువంటి ఆనందాన్ని పొందండి అని అంటాడు కృష్ణుడు. దానికి సమాధానంగా ఇలా అంటున్నారు.

*మూ. వట్టవాయ్చ్చిఱు తూతైయోడు శిఱుశుళకుమ్మణలుజ్కొణ్డు*

*ఇట్టమావిళైయాడువోజ్గళై చ్చిట్రిలీడழித్తెన్ పయన్?*

*తొట్టుతైత్తు నలియేల్‌కణ్డాయ్ శుడర్‌చక్కరజ్గైయిలేన్దినాయ్*

*కట్టియుజ్గైత్తాలిన్నామై యఱితియే కడల్ వణ్ణనే!* 8

ప్రతిపదార్థము: శుడర్= జ్వాలలతో నిండియున్న, చక్కరమ్= శ్రీసుదర్శనచక్రమును కైయిల్= చేతిలో ఏన్దినాయ్= ధరించినవాడా! కడల్ వణ్ణనే!= సముద్రమువంటి వర్ణము గలవాడా! వట్టమ్= గుండ్రని వాయ్= ముఖముగల చిఱు= చిన్న తూతైయోడు= కలశము(బాన)ను చిఱుశుళకుమ్= చిన్నచేటలను మణలుమ్= ఇసుకను కొణ్డు= తీసుకొని ఇట్టమ్ ఆ= మాకు ఇష్టమైనవిధముగా విళైయాడువోజ్గళై= ఆటలాడుకొనుచున్న మాయొక్క చిట్రిల్= బొమ్మరింటిని ఈడు అழిత్తు= పూర్తిగా నశింపచేసి ఎన్ పయన్?= నీవు పొందు ప్రయోజనమేమి? తొట్టు= కాళ్ళతో ముట్టుకొనియు ఉతైత్తు= ఎగురకొట్టియు నలియేల్= బాధించినందున కైత్తాల్= మనసున వెగటు పుట్టినచో కణ్డాయ్= గమనించుము! కట్టియుమ్= బెల్లపు (చక్కెర) కడ్డికూడ ఇన్నామైయై= రుచించకపోవునని(వెగటునే కలిగించునని) అఱితియే= తెలియునా?

వ్యా. ఎనిమిదవ పాశురం. బొమ్మరిళ్ళు కట్టడానికి చిన్న బానలు, చేటలు, ఇసుక మొదలైన వస్తువులు కావాలిగదా. వాటితో ఆటలాడుకొంటున్న మాబొమ్మరిళ్లని పాడుచెయ్యటంవల్ల నీకేమి లాభం? అని కృష్ణుడితో అంటున్నారు. (వట్టవాయిత్యాది) గుండ్రని కలశాల(బానల) మాటవచ్చేసరికి అటువంటి గుండ్రని చక్రాన్ని ధరించిన వాడే జ్ఞాపకానికి వస్తాడు. చాలా భోగ్యమైన సముద్రపు నీలంరంగులో ఉన్న మేని ఛాయతో కనిపించిన ఆ చక్రధారి ఎదురుగా నించున్నాడు. ఆయనను చూడటంతో ఇక దేవతాంతర అర్చనమీదికి మనసు పోలేదు. ఇవన్నీ ఎట్లా ఉన్నాయో చూసేవా?ఒకదానిలా మరొకటి లేకపోయినా అన్నీ కూడా చక్కగా గుండ్రంగా ఉన్నాయి వీటిని మాఇష్టానికి అడ్డులేకుండా ఆడుకుంటున్న మమ్ములని ఒక ప్రత్యేకత ఉన్నవాళ్లనిగా భావించటానికి లేకుండా చాలా బాగా ఉన్నాయి కదూ? అందుకే మరి పూజచెయ్యవద్దనుకున్నా ఈ బొమ్మరిళ్ళని మాత్రం చెరిపేయటానికి

మనసురావటం లేదు. చిన్నగోపికలమైన మేం ఆడుకొనే ఆటలో మామూలుగా అయితే మేంకట్టిన బొమ్మరిళ్ళను ఆట పూర్తవగానే చెరిపేస్తాం. మేం చాలా చిన్నఆడపిల్లలంగనుక మరొకరు చెప్పినట్లు ఆడుకోవటం తెలియకనే మా ఇష్టంవచ్చినట్లు ఏదో ఆడుకొంటున్నాం. మా బానలనీ, చేటలనీ చూస్తేనే మేం ఆటలాడుకొంటున్నామని తెలుస్తుందే! ఇట్లా మా అంతట మేమే కామదేవుడిని పూజించటం మానేస్తున్నా మా బొమ్మరిళ్ళని చెరపాలనుకోవటం ఎందుకు? దానివల్ల నీకేమిటి ఆనందం? నువ్వు వీటిని పాడుచేసేవనుకో, మరెవళ్ళో చెప్పినట్లు చేసి ఆడుకునే వయస్సున్నవాళ్ళం కాదుగదా! అని ఆ ఎదరగా ఉన్న కృష్ణుడితో అన్నారు.

దానికి కృష్ణుడు అమ్మాయిలూ, ఈ బొమ్మరిళ్ళని నా కాళ్ళతోటి, చేతులతోటీ చెరిపివేస్తేనాకు వచ్చే ప్రయోజనం ఏమీ లేకపోవటం నిజమే! మిమ్ములని దుః ఖపెట్టటమే కదా నాకు ప్రయోజనం! లాభానికి వేరే లాభం ఉంటుందా? వీటిని చెడకొట్టటం, దానివల్ల నాకు కలిగే సంతోషమే లాభం" అంటూ వాటిని చేత్తో తడుతున్నాడు. "హరి హరీ, నువ్వు పైఆడవాళ్ళనెందరిని ముట్టుకొని వచ్చేవో, ఆ చేతులతో మమ్ములనీ, మాబొమ్మరిళ్ళనీ ముట్టుకొని మైలబరచకు, దూరంగా పోయి నిలబడు" అన్నారు. దానికి కృష్ణుడు "నేను సర్వేశ్వరుడిని కదా! నా స్పర్శవల్ల మీకు బాధ కలుగుతోందా? అలా అయితే కాలుతో ముట్టుకుంటాను" అని కాళ్ళతో తన్నడం మొదలుపెట్టేడు. తొట్టు ఉతైత్తు– ముట్టుకొంటున్నట్లు భావించి తగినసమయం చూసి కాలితో తన్నివేసి పాడుచేయటం.

అలా ముట్టుకొని మమ్ముని దుఃఖపెట్టకు అంటున్నారు. "ఏం నేను ముట్టుకుంటే మీకు బాధా? నేను మీ అందరికీ నాయకుడిని కదా! మీకు నమ్మకం కలగటం లేదా? అయితే చూడండి" అంటూ ఆనాడు తన విశ్వరూపాన్ని చూపించినట్టుగా శంఖచక్రగదాద్యాయుధాలని ధరించిన తన దివ్యమూర్తిని చూపించి కనపడ్డాడు.

కట్టియుమ్ కైత్తాలిన్నామై – బెల్లానికి తీపిదనము సహజమైన రుచి అయితే చేదుగా ఎట్లా ఉంటుంది అంటే, కంటికి పచ్చకామెర్లు వస్తే చూసిన ప్రతీదీ ఎట్లా పచ్చగా కనబడుతుందో, అలాగనే వ్యాధులవల్లనో, మందులు తీసుకొన్నందువల్లనో, నాలుకచేదెక్కిన వాడికి బెల్లపు కడ్డీకూడ చేదుగనే ఉంటుందన్నమాట. దీనివల్ల

మనకి ఏమిటి తెలుస్తోందంటే, నీలో భోగ్యతకి లోటులేదు. మామనస్సులు నువ్వు చేసే అల్లరి పనులకి విసిగిపోతే మరి నిన్ను ఇష్టపడటం అనేది లేకుండా పోతుంది సుమా అని చెప్పటమే. ఇక్కడ కడల్ వణ్ణన్ అంటే సముద్రపునీరు ఎట్లా ముఖం కడుక్కోవటానికిగాని, త్రాగటానికి గాని ఉపయోగించక చూసి సంతోషించటమే తప్ప మరెందుకూ పనికి రానట్లు నిన్ను కూడా చూసి ఊరుకోవటమే తప్ప మరుందుకూ నువ్వు మాకు ఉపయోగించవు సుమా అని అన్నట్లు భావన. "దీపో నేత్రాతురస్య ప్రతికూలాసి మే భృశమ్(నేత్రరోగికి దీపమువలెనీవు నాకు ప్రతికూలమై యున్నావు) (అనగా – నా కళ్ళకి రోగం ఉండబట్టి స్వచ్ఛంగాఉన్న నిన్ను చూడటం నాకు బాధనే కలిగిస్తోంది అని భావం) అని సీతాదేవిని చూసి శ్రీరాముడు చెప్పినట్లు నీలో ఏమీ లోపంలేకుండా దివ్యమైనవాడివిగా ఉన్నా మాలో ఉండే అపరిపక్వతవల్ల నువ్వు మాకెందుకూ కొరగానివాడివి అవుతావే అనే అర్థాన్ని ఇచ్చేటట్లు ఈమాటలున్నాయి. 8

అవతారిక: బయలు ప్రదేశంలో బొమ్మరిళ్ళని కట్టితే కృష్ణుడు వచ్చి వారిలో కలసిపోయి ఎన్నో అల్లరి చేష్టలను చేసి దుఃఖపెట్టటానికి అవకాశముంటుందని ఈ గోపబాలికలు ఇంటిలోనే ముంగిట్లో వీధితలుపులు మూసివేసి గడియపెట్టుకొని బొమ్మరిళ్ళను కట్టుకొన్నారు.. అపుడతను 'ఈ జాగా మన కోరికని తీర్చటానికి తగినది' అని సంతోషించి వచ్చి ప్రవేశించి బయటనున్న వారెవ్వరును రాలేని ఆ జాగాలోనే బలవంతంగా పాడుచెయ్యటం మొదలు పెట్టేడు. అట్టి స్థితిలో గోపబాలికలు చెప్తున్నారు.

మూ. ముఱ్ఱత్తూడుపుకున్దు నిన్మకజ్ఞాట్టిప్పున్ముఱువల్ శెయ్‌తు
శిఱ్ఱిలోడెజ్ఞళ్‌శిన్దైయుమ్ శితైక్కకడవైయో కోవిన్దా?
ముఱ్ఱమణ్ణిడన్దాలి విణ్ణుఅనీణ్డళన్దుకొణ్డాయ్, ఎమ్మై
ప్పఱ్ఱిమెయ్‌ప్పిణక్కిట్టక్కాల్ ఇన్దపక్కమ్ నిన్ఱవరెన్ శొల్లార్ 9

ప్రతిపదార్థము : కోవిన్దా= కృష్ణా! ముఱ్ఱ మణ్ ఇడమ్= లోకములనన్నింటినీ

*తావి*= దాటి *విణ్ ఉఱ*= పరమపదములో పడునట్లు *నీణ్డు*= పెంచివేసి *అళన్దుకొణ్డాయ్*= కొలచి మహాబలినుండి పొందినవాడా! *ముగ్ర్ఱత్తూడు*= ఇంటిముందు మధ్యను *పుకున్దు*= నీవు ప్రవేశించి *నిన్ ముకమ్ కాట్టి*= నీ తిరుముఖమండలమును అందరికిని చూపించి *పున్ ముఱువల్ శెయ్తు*= చిరునగవు చేసి *శిగ్ర్గిలోడు*= బొమ్మరిళ్ళను, *ఎజ్గళ్ శిన్దైయుమ్*= మాహృదయములను *శితైక్క కడవైయో?*= నశించునట్లు చేయవలెనా? *ఎమ్మై*= మమ్ములను *పగ్ర్గి*= పట్టుకొని *మెయ్‌పిణక్కు*= నీకౌగలింతవంటి శరీరముతో కలియుట *ఇట్టక్కాల్*= చేసినచో *ఇన్దపక్కమ్*= చుట్టుపక్కల *నిన్థవర్*= ఉన్నవారు *ఎన్*= ఏమి *శొల్లార్*= చెప్పలేరు?

వ్యాఖ్యానము : “ఇతను కోరినది చాలదోషమైనది. ఇతనిదృష్టిలో పడితే అల్లరి పెట్టక వదలడు. అందుచేత దాక్కొని ఉండటమే మంచిది” అని అందరూ ఒకచోట చేరి, తమలో తాము చర్చించుకొని “అలా అల్లరి పెట్టేటప్పుడు అందరం కలిసి కట్టుగా వెళ్ళితే ఇతగాడు మనలని అనుసరించే వస్తాడు” అని భావించి ఒక్కొక్కళ్ళే వెళ్ళి అక్కడనున్న అయిదులక్షలకుటుంబాల్లో ఉన్నవారినందరినీ ఒక వాకిట్లోకి ప్రోగుచేసి, తలుపులనీ, ముఖ్యద్వారాలనీ గడియలు వేసి, కృష్ణుడు ప్రవేశించటానికి వీలు లేకుండా చేసేరు. కాని ఇతనికి దారి వెతుకుకోనక్కర్లేదు కదా! వేసిన గుర్తులలాగే ఉండగా అందులోనున్న వెన్నని కాస్తా మాయం చేసేవాడుగదా ఈయన! అనుకోకుండానే ఈ గోపబాలికలు ఆయన చేతికి చిక్కేరు. ఈముంగిట్లో వాళ్ళందరిమధ్యనా వచ్చి నిలుచున్న ఈ గోవిందుడిని చూసేరు. “మనం ఇతడిని తప్పించుకొనివచ్చేమనుకున్నాం. కాని మనకి బాగా బుద్ధిచెప్పేడు. ఇతను మనకంటే ముందుగా ఇక్కడికి వచ్చి కూచున్నాడు. ఏం చెయ్యటం?వీడికి చిక్కిపోయినాం ఇక ఇతనికి దొరకకుండా తప్పించుకోవటానికి మార్గం ఏమిటి?” అంటూ ఆలోచించి ఏమీ దారి కనబడక సిగ్గుపడిపోయి తలలు దించుకొన్నారు. “ మేం వచ్చేసేం. మీతో కలిసి రాలేకపోయాం. ఏదారంటవచ్చేరు? పాపం కాళ్ళు పీకుతున్నాయా?” అన్నట్లుగా ఏవో మాటలు మాట్లాడటం మొదలుపెట్టేడు. దాంతో వాళ్ళు సిగ్గుపడిపోయారు. అది చూసి, చిన్న చిరునవ్వుతూ వాళ్ళని ఎగతాళిగా చూస్తూ అక్కడే ఇటూఅటూ తచ్చాడుతున్నాడు. “నీ పేరుకు తగినట్లు నువ్వు గోవులను

మేపటానికి వెళిపోయినావని అనుకొని మేం బొమ్మరిళ్ళని చెయ్యడం ప్రారంభించేం. అయినా, ఒకవేళ నువ్వుగాని మధ్యలో వస్తే ఏంచెయ్యాలి అని భయపడి ఇంటికి బయట చెయ్యటం మానుకొని ముంగిట్లోనే చెయ్యటం మొదలుపెట్టేం. నువ్వు ఎట్లాగో తలుపు తీసుకొని ముఖం చూపించి, చిరునవ్వులు నవ్వుతూ ముంగిట్లో మధ్యనివచ్చి నిల్చున్నావు. ముంగిట్లోవచ్చినించొని ఇక్కడకి వచ్చిన ఒక్కొక్క గోపికకీ వేరువేరుగా నీ ముఖం చూపించి చిరునవ్వులు చిలకరిస్తున్నావు. "నేను రాలేనని అనుకున్నారు కదూ! వచ్చేసాను చూడండి" అని అంటూన్నట్లుగా ఉన్నది నీ చేష్ట. ముందరే బొమ్మరిల్లుమాత్రం చెరిపేవు. ఇప్పుడు మామనస్సులనికూడా పాడుచేసేవు. మేం అనుకున్నది మురిగిపోయింది. నువ్వు ఒకటి అడిగి దాన్ని ఇచ్చినవాళ్ళనే క్షణంలో పాతాళానికి తోసేసేవాడివి కదా! ఆనాడు నువ్వు చిన్న పొట్టి వామనుడివై మూడడుగుల భూమిని యాచించి ఆక్షణంలోనే పూర్తిగా కొలవటానికి ఆకాశంవరకూ పెరిగినవాడివి కదా! ముంగిట్లోకి ప్రవేశించటం నీకు చాలా గొప్పదా? సరే వచ్చేవు బాగానే ఉన్నది. అది అలా ఉండనీ. "మీరు ముంగిట్లో ఎవళ్ళూరాలేకుండా ఉన్న ఈజాగాయే నాకు అనుకూలంగాఉన్నది. అని అనుకొని నిశ్చయించుకొని మమ్ములను పట్టుకుంటున్నావు. కౌగలించుకుంటున్నావు, మా బట్టలని చించుతున్నావు ఏమేమో చేస్తున్నావు.మాతల్లులదగ్గర నించోలేకుండా చేస్తున్నావు. చుట్టుపక్కలున్నవాళ్ళు ఎన్నోరకాలుగా మమ్ములని అవమానిస్తారే. మేం ఏం చెయ్యటం అంటూ ఈ విధంగా చెప్తున్నారు.

"నన్ను కౌగలించుకోవటం మీకు ఇష్టంగా లేదా? యోగులు నన్ను పెనవేసుకుపోవాలని ఆశపడుతుంటారే" అన్నాడు కృష్ణుడు.

*మూ. శీతైవాయముతముణ్డా యెజ్గళ్ శిగ్ర్గిల్ నీ శితైయేలెన్ఱు*
*వీతివాయ్విళైయాడు మాయర్శిఱుమియర్ మ్ఝలైచ్చొల్లై*
*వేతవాయ్త్తొழిలార్కళ్ వాழ் విల్లిపుత్తూర్ మన్విట్టుశిత్తన్ఱన్*
*కోతైవాయ్త్తమిழ్వల్లవర్ కుఱైవిన్ఱి వైకున్దమ్ శేరువరే.* 10

*ఆణ్డాళ్ తిరువడికళే శరణమ్.*

ప్రతిపదార్థము: *శీతై*= సీతాపిరాట్టియొక్క *వాయ్ అముతము*= అధరామృతమును *ఉణ్డాయ్*= పానము చేసినవాడా! *ఎఙ్గళ్ శిర్ఱిల్*= మాబొమ్మరిళ్ళను *నీ శితైయేల్*= నీవు పాడుచెయ్యవద్దు. *ఎన్ఱు*= అని *వీతివాయ్*= వీధిలో *విళైయాడుమ్*= ఆడుకొనుచున్న *ఆయర్శిఱుమియర్*= గోపబాలికలు *మృழలైచ్చొల్లై*= అస్పష్టములైన మాటలను *వేతమ్*= వేదమునకు చెందిన *వాయ్ తొழిలార్కళ్*= వాక్కులు, చేష్టలు గలవారు *వాழ*= నిత్యవాసముచేయుచున్న *విల్లిపుత్తూర్*= శ్రీవిల్లిపుత్తూరుకు *మన్*= స్వామియైన *విట్టుశిత్తన్ తన్*= పెరియావారులయొక్క *కోతైవాయ్*= ఆండాళ్‌యొక్క వాక్కులనుండి వచ్చిన*తమిழ*= ద్రావిడప్రబంధమును*వల్లవర్*= అభ్యసించినవారు *కుఱైవిన్ఱి*= ఇచ్చుట ఏట్టిలోటును లేక, తదుపరి *వైకున్దమ్*= వైకుంఠమునుకూడ *శేరువర్*= పొందుదురు.

వ్యాఖ్యానము: (పదవ పాశురము.) "ఈషదున్నమ్యపాస్యామి రసాయన మివోత్తమమ్ - మంచి కషాయాన్ని కాస్తంత రుచిచూస్తున్నాను'' అని శ్రీమద్రామాయణంలో చెప్పినట్లుగా వయసువచ్చినగోపికతోనే ఇటువంటి కొంటెపనులు చేస్తే నీకు ప్రయోజనం కదా! నువ్వు ఏమనుకుంటున్నావో తెలిసికొని ఆప్రకారం నీ కోరిక తీర్చటం అనేదానికి అవకాశమే లేని మాదగ్గరకి వచ్చి మా బొమ్మరిళ్ళని పాడుచేయకు" అని ఈ శీతైవాయముతుణ్డాయ్ అనే ప్రయోగానికి భావం అంటారు పెరియవాచ్చాన్పిళ్ళైగారు. వెనుకటి పాశురంలో చెప్పినట్లుగా నిజమైన(యథార్థమైన) కలయికను ప్రసాదించిన కృష్ణుడు గోపికల అధరామృతాన్ని ఆరగించటాన్ని తెలిపేటట్లు ఇక్కడ శీతైవాయముతమ్ ఉణ్డాయ్ అని ప్రయోగించేరు. విళైయాడు అని ప్రయోగించటంవల్ల ఈ గోపికలు ఆటలాడుకొనేందుకు బొమ్మరిళ్ళని కట్టేరని తోస్తుందంటారు ఉత్తమూర్ స్వామి. వీతివాయ్ అనే ప్రయోగం పిల్లలందరూ ఒకచోట కూడేసరికి వాళ్ళని వాళ్ళు మరిచిపోయి ఒంటిమీది బట్టలనికూడా వదిలేసి ఇష్టం వచ్చినట్లు ఆడుకొనే వయస్సుగల గొల్లపిల్లలు అని గమనించవచ్చు. కామదేవార్చన అనేటటువంటి మొదటిపాశురాన్ని గమనిస్తే ఈ గోపబాలికలు నోము నోచుకుంటున్నారని అనిపిస్తుంది. ఏది యథార్థం అంటే, చిన్నపిల్లలవటంచేత నోము నోచటం కూడా ఒక ఆటాడుకొంటున్నట్టుగానే వాళ్ళు అనుష్ఠించేరని చెప్పవచ్చు.

లేదా, ఆడుకొనే చిన్నపిల్లలు వీళ్ళు. కృష్ణుడు వీళ్ళు తయారుచేసిన బొమ్మరిళ్ళని పాడుచెయ్యకుండా ఉండాలని అతనిని భర్తగా పొందటానికి కామదేవుడిని గురించి నోము నోచుకుంటున్నట్లుగా నటిస్తున్నారని చెప్పవచ్చును. లేదా, ఈపిల్లల సమూహంలో కొంతమంది కొంతమంది నోము నోస్తున్నారనిన్నీ, వాళ్ళకి సాయంగా బొమ్మరిళ్ళని మరికొంతమంది పిల్లలు చేసేరనీ చెప్పవచ్చును అని అంటారు ఉత్తమూర్స్వామి.

వేతవాయ్ ఇత్యాదిప్రయోగం వల్ల శ్రీవిల్లిపుత్తూరులో ఉన్నబ్రాహ్మణులందరూ నోటితో ఉచ్చరించేవి వేదశబ్దాలనిన్నీ, చేసే క్రియలన్నీ వైదికక్రియలేననిన్నీ చెప్పటం జరిగింది. అటువంటి శ్రీవిల్లిపుత్తూరుకి ప్రధానులు పెరియావారు. వారి కుమార్తె అయిన ఆండాళ్ అనుభవించిన భగవదనుభవాన్ని చక్కగా ఒక క్రమంలో అనుసంధించినవారు అని ఆ ప్రయోజనాన్ని పొందేవారిని తెలియజేస్తున్నారు. ఇక్కడ గోదాదేవి నోరార పాడిన ద్రవిడభాషాప్రబంధం అని చెప్పటంలో కేవలం తలంపే కాకుండా తన భగవదనుభవాన్నే ఆమె పాడింది అని చెప్పటం జరుగుతోందన్నమాట. అటువంటి వాళ్ళు పొందే ప్రయోజనం ఏమిటి అంటే శ్రీకృష్ణపరమాత్మని చేరి సంశ్లేషిస్తారనిన్నీ అంతేకాకుండా ఆ స్థితిలోనున్నవారికి చుట్టూ ఉన్నవారుకూడా కైంకర్యపరులే అయిన నిత్యముక్తులే అయి వారందరూ వేంచేసి ఉండే దేశమైన పరమపదాన్ని చేరుతారని ఈ పాశురం సాయిస్తోంది.

ఆండాళ్ తిరువడికళే శరణమ్